
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 5 మార్చి 2025



ప్రమాద సమయంలో కార్మికులు బయటకు వచ్చిన టన్నెల్ ఆడిట్ పాయింట్



పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లె వద్ద హంద్రీ-నీవాపై తవ్విన టన్నెల్

హంద్రీ-నీవా కాలువపై ఎత్తిపోతల పథకం తర్వాత మొదలైన పైపులైన్ పనులు


- అప్పట్లో కుప్పకూలిన సి.గొల్లపల్లె సొరంగం
- త్రుటిలో తప్పించుకున్న 50 మంది కార్మికులు
- సొరంగానికి స్వస్తి చెప్పి ఎత్తిపోతలకు వెళ్లి..
- రూ.21 కోట్లు సొరంగంపాలు

## ఎస్‌ఎల్‌బీసీ తరహాలోనే...

# హంద్రీ-నీవా టన్నెల్‌లోనూ...!

**శ్రీశైలం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకంలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనే దాదాపు హంద్రీ-నీవా ప్రధాన కాలువ తవ్వకంలోనూ గతంలో జరిగింది. అయితే ఇక్కడ అదృష్టవశాత్తు 50 మంది కార్మికులు ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. దీంతో అప్పట్లో ప్రభుత్వం, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అప్పట్లో అటు కాంట్రాక్టర్, ఇటు అధికారులు ఈ ఘటనను గోప్యంగా ఉంచడంతో బయటి ప్రపంచానికి తెలియలేదు.**

మదనపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా రెండో దశ పనులు పూర్తయి జిల్లాకు కృష్ణా జలాలు రావాలంటే మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లె, పొన్నేటిపాళెం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెకు 2 కి.మీ.టన్నెల్, పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లె నుంచి కడప జిల్లా చిన్నమండ్యెం మండలం కలిబండ వరకు 5 కిమీ. టన్నెల్ (సొరంగం) పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో మదనపల్లె సమీపంలోని కాట్లాటపల్లె, రామిరెడ్డిగారిపల్లె వద్ద టన్నెల్ పనులను ప్రారంభించిన ఓ కంపెనీ వివిధ కారణాలతో అనుకున్న స్థాయిలో పనులు చేయలేదు. దీంతో ప్రభుత్వం సబ్ కాంట్రాక్టర్ కింద ఉన్నత స్థాయిలో కొత్తగూడెంలోని ముగ్గురు మైనింగ్ ఇంజనీర్ల బృందంతో పనులు తిరిగి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆ కంపెనీ 1.34 కి.మీ. సొరంగం పనులు చేపట్టింది. మెత్తని ప్రాంతంలో ఓ పక్క టన్నెల్ తవ్వుతుండగా, మరోపక్క చుట్టూ ఇనుప రిబ్బులు అమరుస్తూ, మరోపక్క కాంక్రీటు వేయడం, తదితర అయిదు దశల్లో ఈ పనులు చేపడుతూ ముందుకెళ్లారు. సమయంతో పాటు అధిక ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికీ ముందుకెళ్లారు.



టన్నెల్ స్థానంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం

పనులు మొదలుపెట్టిన అధికారులకు ఒక కి.మీ. వెళితే గానీ అసలు విషయం బయట పడలేదు. అక్కడి తెల్లని చౌడుమట్టి, బురదను చూసి అధికారులు ఖంగుతిన్నారు. ఓ పక్క సొరంగం పనులు జరుగుతుండగా, మరోపక్క టన్నెల్ కూలిపోతూ మట్టి, బురద నీరు ప్రత్యక్షం కావడంతో పనులు ఆపేశారు.

### ఆ కక్కుర్తే కొంప ముంచిందా?

టన్నెల్ అలైన్‌మెంట్‌లో భాగంగా కొండలో కాకుండా, మైదాన ప్రాంతంలో తీసుకెళ్లారు. రాయిలో కంటే మట్టిలో ఈజీగా తవ్వవచ్చనే కాసుల కక్కుర్తే కొంపముంచిందని తర్వాత తెలుసుకున్నారు. కొండల మధ్య వ్యాలీలో రెండు చెరువులు ఉన్నాయి. అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు కూడా నిండాయి. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లె వద్ద 2016 మే నెలలో మాన్యువల్ (డ్రిల్లింగ్, బ్లాస్టింగ్) పద్ధతిలో ఈ పనులు జరుగుతుండగా నీరు లీకు కావడం మొదలైంది. సుమారు 120 మీటర్ల లోతులో జరుగుతున్న ఈ పనుల బ్లాస్టింగ్‌తో భూమి దద్దరిల్లింది. ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయానికి వేసిన బోర్లు కూడా టన్నెల్ వరకు ఉన్నాయి. భూమి పొరల్లోని వాటి ద్వారా బురద, నీళ్లు మొదలై, తర్వాత రంధ్రాలు పెద్దవై టన్నెల్ నిండిపోయింది. ఈ క్రమంలో కూలుతున్న టన్నెల్‌ను గుర్తించిన 50 మంది కార్మికులు మధ్య భాగంలోని ఆడిట్ పాయింట్ త్రుటిలో తప్పించుకుని బయటకు వచ్చేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో చివరకు కాంట్రాక్టర్ కూడా టిప్పర్లు, హిటాచీలు, ఇతర వాహనాలను అక్కడే వదిలేశారు. రూ.130 కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ పనులను రూ.270 కోట్లతో ఎత్తిపోతల, పైపులైన్ పనులు పూర్తి చేయగా, అప్పటికే టన్నెల్ కోసం ఖర్చు చేసిన రూ.21 కోట్లు మట్టిలో కలిసిపోయినట్లయింది.

### పరీక్షల్లో అన్నీ ఓకే...

సాధారణంగా సాగునీటి ప్రాజెక్టుల్లో కాలువలు తవ్వడానికి వీలులేని కొండలు, గుట్టల్లో టన్నెల్‌కు వెళతారు. ఆ పనులు ప్రతిపాదించే ముందు బోర్లు తవ్వకం, ఎలక్ట్రిక్ పరికరాలతో రాతి గట్టి తనాన్ని అంచనా వేసేందుకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇక్కడ జరిపిన ఎలక్ట్రిక్ పరీక్షలన్నింటిలోనూ రాయి వివిధ స్థాయిల్లో గట్టిగా ఉన్నట్లే వచ్చిందని గుర్తించారు. అయితే 5 కి.మీ.టన్నెల్‌లో 2 కి.మీ. పూర్తికాగానే మెత్తని మట్టి రావడంతో అధికారులు ఖంగుతిన్నారు. మరి పరీక్షల ద్వారా తేలింది ఏంటని, వాటిని నమ్ముకునే టన్నెల్‌కు వెళితే రూ.21 కోట్లు వృథాతో పాటు రెండేళ్ల సమయం సొరంగంలో కలిసిపోయిందని హంద్రీ-నీవా అధికారులు నిట్టూర్చారు. అప్పట్లో పదేళ్లుగా వర్షాలు లేకపోవడం కొండలు, గుట్టల లోపల ఉన్న శుద్ధ మట్టి గట్టిబారి రాయిగా పరీక్షల్లో రాగా, ఈ గట్టి శుద్ధనే రాయిగా భావించి ముందుకెళ్లారు. తర్వాత 2015 నవంబరు, డిసెంబరులలో కురిసిన వర్షానికి భూమి మెత్తబడి, శుద్ధరాయి కరిగి టన్నెల్ కూలిపోవడానికి కారణమైంది.

### ఆ సంఘటన తలచుకుంటేనే భయమేస్తోంది



ఆరోజు పెద్ద ప్రమాదం నుంచే బయటపడ్డాం. ఏమాత్రం ఆలస్యం అయినా 50 మంది కార్మికులు మట్టిలో కలిసిపోయేవారు. టన్నెల్‌లో పనిచేస్తున్న కార్మికులు బయటకు రావడానికి ఎంచుకున్న మార్గం కరెక్ట్. ఆడిట్ పాయింట్ కాకుండా రైట్‌కు వెళ్లి ఉంటే బయటకు వచ్చే వారే కాదు. సాధారణంగా ప్రమాద సమయంలో కార్మికులు భయంతో ఎక్కడ మార్గం ఉంటే అక్కడికి పరుగులు తీస్తారు. మొదట వెళ్లిన వ్యక్తినే మిగిలిన వారూ అనుసరిస్తారు. ఇప్పుడు ఎస్‌ఎల్‌బీసీలో జరిగిన ప్రమాదంతో అప్పటి ఇన్సిడెంట్‌ను తలచుకుంటేనే భయమేస్తోంది. ఎలక్ట్రిక్ పద్ధతిలో చేసిన భూ పరీక్షల్లో భూమి, రాళ్లు గట్టిగా ఉన్నట్లే ఫలితం వచ్చింది. అది శుద్ధ అని గ్రహించలేకపోయారు. భూప్రకంపనలతో పొరల నుంచి నీళ్లు చేరి టన్నెల్ కూలిపోయింది. ఈ టన్నెల్ తవ్వడానికి చాలా అడ్డంకులు, ఆటుపోట్లు ఎదుర్కొన్నాం. ఎక్కడికీ వీలు లేకపోవడంతో పనులు అర్ధంతరంగా ఆపేశాం. భూమి గట్టితనాన్ని గుర్తించే క్రమంలో ఎలక్ట్రిక్ పద్ధతిని వాడటం, అలైన్‌మెంట్ కొండలు, గుట్టలు గుండా కాకుండా వ్యాలీలో తీసుకెళ్లడం కూడా పొరపాటే. ఆ రోజుల్లో ఆ స్థాయిలో అనుభవం, పరిజ్ఞానం లేకపోవడం కూడా కారణం కావచ్చు.

- ఆర్.మురళీనాథరెడ్డి, రిటైర్డ్ సీఈ, వెలుగొండ ప్రాజెక్టు.

---

## అగ్నిప్రమాదాల నివారణే ధ్యేయం

- జిల్లా ఫైర్ అధికారి అనిల్‌కుమార్

ఫటాఫట్



మదనపల్లె టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవిలో అగ్నిప్రమాదాల నివారణే ధ్యేయంగా పనిచేస్తున్నామని జిల్లా ఫైర్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో ఎనిమిది ఫైర్ స్టేషన్లకు గాను ఆరు స్వంత భవనాల్లో ఉన్నాయని, ములకలచెరువు, వాల్మీకిపురం ఫైర్‌స్టేషన్‌లకు రూ.3.10 కోట్లు మంజూరయ్యాయన్నారు.

**ప్రశ్న:** వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు ఏమి చర్యలు తీసుకున్నారు?

**సమాధానం:** అగ్నిప్రమాదాల నివారణకు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. గృహాల్లో గ్యాస్ సిలిండర్ లీకేజి అయి మంటలు వ్యాపిస్తే తీసుకోవాల్సిన చర్యలపై వీధుల్లో ప్రతి నెలా నాలుగుసార్లు మాక్‌డ్రిల్‌తో అవగాహన కల్పిస్తున్నాం.

**ప్రశ్న:** విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు ఎందుకు జరుగుతాయి? నివారణ చర్యలు?

**సమాధానం:** ఇళ్లు, దుకాణాలు, గోదాములు, పరిశ్రమల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు సక్రమంగా వైరింగ్ చేయకపోవడం, ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం కారణం. విద్యుత్ అధిక లోడ్ పెరగడంతో వైర్లు కరిగిపోయి షార్ట్‌సర్క్యూట్ అయి అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంసీబీలు ఏర్పాటు చేసుకోవాలి. పదేళ్లకు ఒకసారి వైరింగ్ మార్చుకోవాలి.

**ప్రశ్న:** పట్టణాల్లో ఇరుకైన సందుల్లో అగ్నిప్రమాదాలను ఎలా అరికడతారు?

**సమాధానం:** ఇరుకైన సందుల్లో ఫైర్ ఇంజన్ వాహనం వెళ్లలేని పరిస్థితుల్లో పొడవైన పైపుల ద్వారా నీటిని అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశంలో వెదజల్లుతాము. కార్బన్‌డయాక్సైడ్ సిలిండర్లతో మంటలను ఆర్పుతాము. మినీ జీపు, బుల్లెట్ వాహనంలో అమర్చిన అగ్నినిరోధక పరికరాలతో మంటలను అదుపులోకి తీసుకొస్తాము.

**ప్రశ్న:** జిల్లాలో ఎన్ని ఫైర్ స్టేషన్లకు శాశ్వత భవనాలు ఉన్నాయి?

**సమాధానం:** జిల్లాలో ఎనిమిదికి గాను తంబళ్లపల్లె నియోజకవర్గానికి గాను ములకలచెరువు మండలం బురకాయలకోట వద్ద హైవే పక్కన 15వ టీఎఫ్‌సీ నిధులు రూ.2.25 కోటత్లో ఫైర్ స్టేషన్ నిర్మిస్తాం. వాల్మీకిపురంలో ఫైర్‌స్టేషన్ కోసం నిర్మించిన జీ ప్లస్ వన్ భవనం అసంపూర్తిగా ఉంది. ఈ భవనానికి రూ.85 లక్షలు కేటాయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తి కాగానే వీటి నిర్మాణాలకుగాను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా టెండర్లు పిలుస్తాము.

**ప్రశ్న:** ఈ ఏడాదిలో ఎన్ని ప్రమాదాలు జరిగాయి? నష్టం ఎంత? ఎంత ఆస్తులను కాపాడారు?

**సమాధానం:** జిల్లాలో 2 అతిపెద్ద అగ్నిప్రమాదాలు, 19 మధ్య స్థాయి, 325 చిన్న అగ్నిప్రమాదాలు జరిగాయి. సాధారణ ప్రమాదాలు, అత్యవసర ప్రమాదాలు 21 చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో రూ.3,43,91,000 నష్టం జరిగింది. రూ.1,19,22,8000 విలువైన ఆస్తులను కాపాడాము. ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా, నాలుగు పశువుల ప్రాణాలు కాపాడాము.

**ప్రశ్న:** అగ్నిప్రమాదాలు, విపత్తులు జరిగితే ఎవరిని సహాయం అడగాలి?

**సమాధానం:** అగ్నిప్రమాదాలు, విపత్తులు సంభవిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 101కు కాల్ చేయాలి. రాయచోటిలో 99637 37253, లక్కిరెడ్డిపల్లెలో 99637 27731, రాజంపేటలో 99634 79554, రైల్వేకోడూరులో 99638 79126, మదనపల్లెలో 99637 35597, వాల్మీకిపురంలో 99637 37042, ములకలచెరువులో 99637 36976, పీలేరులో 99637 36587 నెంబర్లకు ఫోన్ చేయాలి.

## బాధ్యతలు విస్మరించొద్దు

- జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



వాల్మీకిపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

వాల్మీకిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగులు తమ బాధ్యతలను విస్మరించకుండా విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. మంగళవారం వాల్మీకిపురం రెవెన్యూ కార్యాలయంలో కలికిరి, కురబలకోట, ములకలచెరువు, వాల్మీకిపురం మండలాల తహసీల్దార్లతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్ సవరణలు, సమస్యలపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలను త్వరితగతిన సమగ్ర రికార్డుల ఆధారంగా సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. మండలంలోని చింతపర్తి గ్రామంలో వెలసిన పురాతన చెన్నకేశవస్వామి దేవాలయం భూమి సైతం వేరొకరి పేరుతో పట్టా పాసుపుస్తకం ఇచ్చేశారని ఆలయ ధర్మకర్త రాజేష్‌కుమార్‌రెడ్డి, గుంటిగంగమ్మ ఆలయ మాజీ ధర్మకర్త సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ భూమిని ఎం.వెంకటరమణారెడ్డి పేరుతో అక్రమంగా పాసుపుస్తకాలు మంజూరు చేశారని తక్షణమే సర్వే చేయించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ తక్షణమే సమస్యను పరిష్కరించాల్సిందిగా స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్‌లు పామిలేటి, మహేశ్వరిబాయి, తపశ్వని, ప్రదీప్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉపవాసం.. ఆరోగ్యదాయకం
- శారీరక, మానసిక ఉపయోగం
- ఇహపర ప్రయోజనం
6

## వీరభద్రుడి పార్వేట ఉత్సవంలో ఉద్రిక్తత

- ఊరేగింపులోకి దూసుకొచ్చిన ఓ వర్గం యువత
- స్వయంగా రంగంలోకి దిగిన ఎస్పీ
- పరిస్థితి అదుపులోకి...



మత పెద్దలతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఠాణా వద్ద నుంచి వెళుతున్న వీరభద్రుడి పార్వేట ఉత్సవం

రాయచోటి టౌన్, మార్చి 4 : రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రుడి పార్వేట ఉత్సవం సందర్భంగా ఠాణా వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వీరభద్రుడి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు పార్వేట ఉత్సవంలో భాగంగా అశ్వవాహనంపై వీరభద్రాలయం నుంచి గాంధీబజారు, ఠాణా మీదుగా రవి హాల్ సమీపంలోని పార్వేట మండపం వద్దకు వెళ్లే క్రమంలో ఠాణా వద్ద ఓ వర్గానికి చెందిన నలుగురు యువకులు ఊరేగింపులోకి దూసుకొచ్చారు. బందోబస్తుగా ఉన్న పోలీసులు వారిని అడ్డుకుని తరిమికొట్టడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అరగంటలో ఓ వర్గానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి రావడంతో పార్వేట ఉత్సవ కమిటీ సభ్యులు, మరో వర్గానికి చెందిన వారి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఏఎస్పీ వెంకటాద్రితో పాటు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని పరిస్థితిలోకి అదుపు చేశారు.

ఒకానొక దశలో ఓ వర్గానికి చెందిన వారు పోలీసులపైకి రాళ్లు, చెప్పులు విసరడంతో వారందరినీ పోలీసులు చెదరగొట్టి కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉత్సవం యధావిధిగా జరిగింది.

## జిల్లాలో ఆధార్ నమోదు పెంచాలి

- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధార్ నమోదు శాతం పెంచేందుకు అధికారులు అందరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌వో అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ సమీకరణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ స్టేట్ రీజనల్ కార్యాలయ సహాయ మేనేజర్ దామోదర్ జిల్లాలో ఆధార్ నమోదు ప్రగతి. 0-5 పిల్లల నమోదు, మొబైల్ బయోమెట్రిక్ యూనిట్లు, నమోదు సందర్భంగా తిరస్కరణకు గురవుతున్న అంశాలు, సాంకేతిక సమస్యలు తదితరాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. అనంతరం డీఆర్‌వో మాట్లాడుతూ జిల్లాలో సచివాలయాలు, పోస్టాఫీసులు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ ఇతరత్రా మొత్తంగా 212 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయన్నారు. సచివాలయాలు, పోస్టాఫీసు, బ్యాంకుల్లో ఆధార్ నమోదు శాతాన్ని పెంచాలని తెలిపారు. 0-5 వయసున్న పిల్లల నమోదులో దాదాపు 28 వేలకు పైబడి పెండింగ్ ఉన్నాయని, వీటన్నింటినీ నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసులు, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, డీఈవో సుబ్రమణ్యం, ఐసీడీఎస్ ఇన్‌చార్జి అధికారి రమాదేవి, ఎల్‌డీఎం అంజనేయులు, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారులు, వివిధ బ్యాంకర్లు, పోస్టల్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్యాసింజర్ రైళ్ల రద్దు

- నెలాఖరు వరకు పొడిగింపు
- మళ్లీ ఉత్తర్వులు జారీ చేసిన రైల్వేశాఖ



ములకలచెరువు మీదుగా నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లు (ఫైల్)

ములకలచెరువు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ములకలచెరువు మీదుగా గుంతకల్లుకు నడిచే నాలుగు ప్యాసింజర్ రైళ్ల రద్దును నెలాఖరు వరకు పొడిగిస్తూ రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కుంభమేళాకు ఈ మార్గంలో నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లను మళ్లించిన విషయం విదితమే. దీంతో గత ఏడాది డిసెంబరు 18వ తేదీ నుంచి నుంచి రెండు నెలల పాటు ఈ మార్గంలో ప్రతిరోజూ ఉదయం, రాత్రివేళల్లో తిరుపతి-గుంతకల్లు జంక్షన్, గుంతకల్లు జంక్షన్-తిరుపతి నడిచే నాలుగు ప్యాసింజర్ రైళ్లు రద్దయ్యాయి. ప్యాసింజర్ రైళ్లను రద్దును మరో వారం రోజులు పొడిగించి ఈనెల 7వతేదీ నుంచి యధావిధిగా నడుపుతామని తెలిపిన రైల్వేశాఖ తాజాగా ఈనెలాఖరు వరకు నాలుగు రైళ్ల రద్దును పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 30, 31వ తేదీల నుంచి రైళ్లు యధావిధిగా నడుస్తాయని రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రైళ్లను తిరిగి నెలాఖరు వరకు రద్దు చేయడంపై ప్రయాణీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రంజాన్ వేళలు



| | ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం) | సెహరీ (గురువారం ఉదయం) |
|---|---|---|
| రాయచోటి | 6.28 | 5.09 |
| మదనపల్లె | 6.30 | 5.16 |
| రాజంపేట | 6.26 | 5.17 |
| పీలేరు | 6.28 | 5.09 |

# ఉపవాసం.. ఆరోగ్యదాయకం

● శారీరక, మానసిక ఉపయోగం ● ఇహపర ప్రయోజనం



పీలేరు అక్సా మసీదులో ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు

పీలేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది ఉపవాసం (రోజా). రంజాన్ మాసానికి మాత్రమే ప్రత్యేకమైన, ప్రధానమైన ఆరాధన ఉపవాసం. ఏడాదిలోని 11 నెలలు తమకిష్టమైన రీతిలో గడిపే ముస్లింలు రంజాన్ మాసంలో మాత్రం విధిగా ఉపవాసాలు పాటిస్తారు. కలీమా, నమాజు, రోజా, జకాత్, హజ్, అనేవి ఇస్లాం ధర్మానికి మూలస్తంభాలు. వాటిలో నమాజ్ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగినది రోజా. జకాత్ (పేదలకు దానం చేయడం), హజ్ (పవిత్ర మక్కా యాత్ర) ఆర్థిక స్థోమత ఉన్న వారు మాత్రమే చేయగలిగినది. నమాజు, రోజా మాత్రం పేద, ధనిక తేడా లేకుండా అందరూ ఆచరించగలిగిన ధర్మం. ఉపవాసాలు పాటించడం వల్ల ఇహ, పర ప్రయోజనాలు న్నాయని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రంజాన్ మాసపు ఉపవాసాలు పాటించాలని పెద్దలు చెబుతున్నారు.

**ఉపవాస దినాల్లో పాటించాల్సిన నియమాలు**

- ఉపవాసాలు ఉన్న వారు విధిగా ఐదు పూటలా నమాజు చేయాలి.
- రాత్రి తరావీహ్ నమాజు చేయాలి.
- చాడీలు, అబద్ధాలు చెప్పకూడదు.
- తగవులు, మనస్పర్థలకు దూరంగా ఉండాలి.
- ఉపవాసం ప్రారంభించేటప్పుడు (సెహర్), సాయంత్రం ఉపవాస దీక్ష విరమించేటప్పుడు (ఇఫ్తార్) దీక్షా సంకల్పం (నియ్యత్) పఠించాలి.
- పాపిష్టి సొమ్ము అని తెలిసిన తరువాత దానిని భుజించకూడదు.

**ఆకలి బాధ గ్రహించేందుకు.....**

పేదల ఆకలి బాధ అందరికీ తెలియాలన్న లక్ష్యంతో అల్లాహ్ రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించాలని ఆదేశించారని మహమ్మద్ ప్రవక్త (స.అ.సం) తన హదీసుల్లో తెలియజేశారు. ఆకలి బాధను గ్రహించిన వారికి తమ పొరుగు వారి బాధలను సులభంగా అర్థం చేసుకుని వారికి సహాయపడే గుణం అలవడుతుందన్నది ఉపవాస ప్రయోజనాల్లో ఒకటి. ఆరోగ్యంగా ఉంటూ రంజాన్ మాసపు పవిత్రత పొందలేని వాడు నిజంగా దురదృష్టవంతుడని ఆయన తెలిపారు. ఏడాదికి 11 నెలలు సొంతానికి, రంజాన్ నెల మాత్రం అల్లాహ్ ఇబాదత్ (దైవ చింతన) కోసం ఏర్పాటైనట్లు మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) పేర్కొన్నారు. ఉపవాసాలు ఉన్న వారికి అల్లాహ్ అనుగ్రహంతోపాటు, సాధారణ రోజుల కంటే అధిక ఆహారం లభిస్తుందని ఆయన తెలిపారు. దైవ చింతన తప్ప ప్రాపంచిక విషయాలపై దృష్టి మరల్చకుండా, చాడీలు, అబద్ధాలకు దూరంగా ఉంటూ ఐదు పూటలా నమాజు పాటిస్తూ ధర్మనిష్ఠ, నిష్కల్మష మనసుతో ఉపవాసాలు చేస్తే మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

**ఉపవాసంతో లాభాలు..**

- ఉపవాసాలతో జీర్ణాశయ వ్యవస్థ ప్రక్షాళన అవుతుంది.
- శరీరంలో గ్లూకోజ్ నిల్వలపై నియంత్రణ,ఇన్సులిన్ గ్రహించేశక్తి పెరుగుతుంది.
- రోగాల నుంచి సహజ రక్షణ లభిస్తుంది.
- చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- హైబీపీ దూరమవుతుంది.
- ఆకలిపై అదుపు పెరుగుతుంది.
- నిగ్రహ శక్తి పెరుగుతుంది. .

**మూడు భాగాలుగా ఉపవాసాలు..**

రంజాన్ మాసపు 30 ఉపవాసాలు మూడు భాగాలుగా విభజితమయ్యాయి. మొదటి పది ఉపవాసాలను అల్లాహ్ కరుణను (రెహమత్) అభ్యర్థించేవిగా, రెండవ పది ఉపవాసాలను తాము చేసిన పాపాల నుంచి క్షమాపణ కోరడం, మూడవ పది ఉపవాసాలను దైవానుగ్రహం కోరేవిగా విభజించారు. ఆయా రోజుల్లో ఆయా ప్రార్థనలను ఉపవాస దీక్షల విరమణ సమయంలో విధిగా పాటించాలని మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) తెలిపారు.

**ఉపవాసాలపై పరిశోధనకు నోబెల్ ప్రైజ్**

ముస్లిం ఉపవాసాలపై చేసిన పరిశోధనలకుగాను యాషినోరి ఓషమీ అనే జపాన్ శాస్త్రవేత్తకు 2016లో నోబెల్ బహుమతి లభించింది. ఉపవాసాల వల్ల శరీరంలో ఆటోఫ్యాగీ (సెల్ఫ్ ఈటింగ్ సిస్టం) జరిగి క్యాన్సర్ కణాలు, రోగ కారక క్రిములు నశిస్తాయని ఆయన శాస్త్రీయంగా నిరూపించారు.

**ఆరోగ్యవంతులందరూ ఉపవాసాలు చేయాలి**



ఉపవాసాల ప్రయోజనాలు పొందలేని వారు దురదృష్టవంతులని మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) తెలిపా రు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రం జాన్ ఉపవాసాలు పాటించాలి. ఉపవాసా లు ఓర్పు, సహనం నేర్పిస్తాయి. రంజాన్ మాసంలో నేర్చుకున్న విషయాలతో మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా, నియమబద్ధంగా, ఉన్నతంగా గడపవచ్చు.

\- ముఫ్తీ అబ్దుల్లా, ఇమామ్, జామియా మసీదు, పీలేరు

# ప్రీ స్కూల్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

● ఐసీడీఎస్ పీడీ రమాదేవి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ రమాదేవి

పీలేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పూర్వ పాఠశాల విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధి కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. ఆర్టీసీ నల్లగుట్టలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె అంగన్‌వాడీ కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆట పాటలతో చిన్నారులను ఉత్సాహపరిచారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,275 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో 1,858 ప్రధాన, 417 మినీ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1030 కేంద్రాలు సొంత భవనాల్లో నడుస్తుండగా 795 కేంద్రాలు అద్దె భవనాల్లో, 450 కేంద్రాలు ఉచిత భవనాల్లో నడుస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 9,260 మంది గర్భిణులు, 8,323 మంది బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, ఇతర సేవలు అందిస్తున్నామన్నారు. ఏడు నెలల పసికందు నుంచి మూడేళ్ల వయసున్న 53,022 మంది, 3-6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు 42,037 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పొందడమే కాకుండా పూర్వ పాఠశాల విద్యను పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజమ్మ, సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ వర్కర్లు అఖిల, అనిత, సహాయకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైభవంగా బాట గంగమ్మ రాత్రి తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో బాటగంగమ్మ

మదనపల్లె అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గవంక కాల్వలోని బాట గంగమ్మ ఆలయంలో రెండు రోజులుగా తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు ఆలయధర్మకర్త బొగ్గిటి అలివేలు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయం శుద్ధి చేసి పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో చెక్క భజనలు, కోలాటాలు ప్రదర్శించారు. భక్తులు దీలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ బొగ్గిటి అలివేలమ్మ, తదితరులు పర్యవేక్షించారు.

## పోలీసుల అదుపులో గంజాయి ముఠా?

గుర్రంకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణం నడిబొడ్డున వెల్డింగ్ దుకాణంలో గంజాయి పట్టుబడడం గుర్రంకొండలో కలకలం రేపుతోంది. పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో దానికి అలవాటుపడిన యువకులు ఊరు దాటేసినట్లు సమాచారం. గుర్రంకొండ పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ప్రహరీగోడ పక్కనే కొందరు రేకులషెడ్‌లు ఏర్పాటు చేసుకుని అందులో వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఓ షెడ్లలో ఉన్న ఓ వెల్డింగ్ దుకాణంలో కొంత కాలంగా గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోమవారం రాత్రి తనిఖీ చేయగా కొంత మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. దీంతో గంజాయి బ్యాచ్‌ల్లో వణుకు మొదలై చాలా మంది పరారైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మధు రామచంద్రుడును వివరణ కోరగా గంజాయి పట్టుబడిన విషయం వాస్తవమేనని, నిందితులను పూర్తి స్థాయిలో విచారణ చేసి ముఠా సభ్యులను అరెస్టు చూపుతామన్నారు.

## రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

సిద్దవటం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరంలో సోమవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. డీలర్ బిట్రా సుబ్బరాయుడు, ఎండీయూ ఆపరేటర్ శంకర్ నివాసాల్లో 750 కిలోల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, వీఆర్వో శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాలివీడు, మార్చి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భిక్షాటన చేసుకునే గుర్తు తెలియని వ్యక్తి కడప రిమ్స్ లో మృతి చెందాడని, అతడి గురించి తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. 30 ఏళ్లుగా గాలివీడు పట్టణంలోని గేటు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ వీధుల్లో తిరుగుతుండే అతను అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడిని గుర్తుపడితే గాలివీడు ఎస్‌ఐ 9121100556 సెల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**రాజంపేటలో..**



యాచకుడి మృతదేహం

రాజంపేట టౌన్: రాజంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని ఓ వృద్ధ యాచకుడు మృతి చెందాడు. రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మెయిన్‌గేటు ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి పక్కన అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అతని వివరాలు తెలియరాలేదు.

## ఈ చిన్నారులకు దిక్కెవరు?

● తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన బాలికలు



తల్లిదండ్రులతో చిన్నారులు కృతికారెడ్డి, లిత్వికారెడ్డి (ఫైల్)

కురబలకోట, మార్చి 4 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదం ఇద్దరు చిన్నారులను అనాథలను చేసింది. వాల్మీకిపురం మండలం విఠలం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ అడవిపల్లెకు చెందిన శారద(40) మృతి చెందగా, ఆ ప్రమాదంలో గాయపడిన మాధవ రెడ్డి(50) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం మాధవరెడ్డి అంత్యక్రియల సందర్భంగా వారి కూతుళ్లు ఏడేళ్ల కృతికారెడ్డి, మూడేళ్ల లిత్వికారెడ్డి రోదన కంట తడి పెట్టించింది. అమ్మా...నాన్నా మాకు దిక్కెవరంటూ రోదిస్తున్న ఆ చిన్నారులను సమదాయించడం ఎవరికీ సాధ్యం కాలేదు.

## ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న రెండు గ్రామాల వీఆర్వోలు

పెనగలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పెనగలూరు మండలం ఓబిలి వీ ఆర్వో నరసింహులు, నందలూరు మండలం టంగుటూరు వీఆర్వో శివకుమార్ మంగళవారం అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్ల డ్రైవర్లకు, వీఆర్వోల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వారు దాడికి తెగబడే పరిస్థితి వస్తుందని పసిగట్టిన వీఆర్వోలు పెనగలూరు పోలీసులకు, స్థానిక తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు. అయితే, వారి నుంచి ఎలాంటి సహకారం లభించకపోవడంతో స్థానికుల సాయంతో కొన్ని ట్రాక్టర్లను మాత్రం ఇసుక నింపుకోకుండా అడ్డుకోగలిగారు.

# పక్కా గృహాల నిర్మాణం పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ శివయ్య



విలేకరులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శివయ్య

రామాపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణాలను మార్చి 30 నాటికి పూర్తి చేయించాలని హౌసింగ్ పీడీ శివయ్య ఏఈలను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 79,721 పక్కా గృహాలు మంజూరు కాగా, 2024 జూన్ నాటికి 33,179 పక్కా గృహాలు పూర్తి కాగా, 12,390 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 32,118 పక్కా గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో 4,864 పక్కా గృహాల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రామాపురం మండలంలో హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న కేఎస్ఎం ప్రసాద్ 12 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తుండడంతో ఆయనను ఓబులవారిపల్లె మండలానికి బదిలీ చేస్తూ ఈ నెల 1న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని, కానీ ఇంతవరకు ఆఫీసుకు రాలేదని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక వారానికి మూడుసార్లు హౌసింగ్ లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అవుతోందని దీంతో లబ్ధిదారులు ఉత్సవంలా తమ ఇళ్లను నిర్మించుకుంటున్నారన్నారు.

ఈ ప్రభుత్వం ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, బీసీ చేనేత మగ్గాలకు రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు శ్రద్ధ చూపి త్వరగా గృహాలు నిర్మించుకోవాలన్నారు. కొత్తగా ఇళ్లు కావలసిన వారు, సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవాలనుకున్న వారు గ్రామ పరిధిలోని సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ డిజిటల్ అసిస్టెంట్లను కలిసి దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా పాల్గొన్నారు.

# చెరువులు ఆక్రమిస్తే కఠినచర్యలు: ఆర్డీవో

● కొండ్రాజుపల్లె చెరువులో ఆక్రమణల పరిశీలన

● హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



కొండ్రాజుపల్లె చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్, హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కాశినాయన మార్చి4(ఆంధ్రజ్యోతి)చెరువులు ఆక్రమిస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టేదిలేదని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ హెచ్చరించారు. మంగళవారం ఆక్రమణకు గురైన కొండ్రాజుపల్లె చెరువును తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. చెరువులో ఆక్రమణదారులు బోర్లు వేసి కరెంట్ సర్వీసులు ఏర్పాటు చేసుకొని అరటి,దొండ,బత్తాయి తదితర పంటలను సాగుచేయడం, మరి కొందరు పంటలు సాగుచేసేందుకు చెరువు దుక్కిదున్ని సిద్ధం చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువు మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1017, 1018 సర్వే నెంబర్లలోని 151.10 ఎకరాల్లో చెరువు విస్తరించిందన్నారు. ఇందులో పట్టాభూమి 35.75 ఎకరాలు, ప్రభుత్వభూమి 115.34 ఎకరాలు ఉందన్నారు. దాదాపు 67 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయి విస్తీర్ణాన్ని గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలని, చెరువులోకి ఆక్రమణదారులు ఎవరూ దిగకుండా చుట్టూ కందకం తవ్వాలని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు చెరువుకు హద్దులు నిర్ణయించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో బద్వేల్ సర్వే డీఐ రఘురామయ్య, మండల సర్వేయర్ రామాంజనేయులు, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ కొండారెడ్డి స్థానిక వీఆర్వో నరసింహులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ నేతల ఆక్రమణలపై విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దారు సుబ్బలక్ష్మమ్మ, ఎంపీడీవో భాస్కర్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ

అట్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన 1245/6 సర్వే నెంబరులోని సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిలో 20 ఏళ్లుగా స్థానికంగా ఉన్న యాదవులు గొర్రెలను మేపుకునే వారు. సుమారు 55 కుటుంబాలు అందులోనే గుడిసెలు వేసుకుని, దొడ్లు కట్టుకుని గొర్రెలను పోషించుకునేవారు. 2022లో వైసీపీ నాయకులు ఆ గుడిసెలు, దొడ్లను తొలగించి యంత్రాలతో చదును చేసి భూమిని ఆక్రమించుకోవడంతో కోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకు మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం సమర్పించడంతో, సమస్యను పరిశీలించాలంటూ ఆయన జిల్లా అధికారులకు రెఫర్ చేసినా, స్థానిక అధికారులెవరూ పట్టించుకోలేదని యాదవ సంఘం నాయకుడు గురవయ్య తెలిపారు. ఇంతలో సమస్య పరిష్కారమైందా అంటూ వారం రోజుల క్రితం విజయవాడ టీడీపీ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో పరిష్కారం జరగలేదని సమాధానమిచ్చామన్నారు. వారం రోజుల అనంతరం మంగళవారం అట్లూరు తహసీల్దారు సుబ్బలక్ష్మి, ఎంపీడీవో భాస్కర్ బాబు, అట్లూరు ఎస్ఐ రామకృష్ణ తమ ఇంటి దగ్గరకు వచ్చి విచారణ చేశారన్నారు. న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు గురవయ్య వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ 1245/6 సర్వే నెంబరు లో 2009లో కొందరికి పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో ఉందని తెలిపారు. . ఈ కార్యక్రమంలో వీఆర్వో సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్‌పై అతివేగం

● ఒకరి దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): గరుడ వారధిపై బైకును మితిమీరిన వేగంతో నడిపారు. రామానుజం సర్కిల్ వద్ద అదుపు చేయలేక రక్షణ గోడను ఢీకొన్నారు. ఇద్దరు యువకులు పైకి ఎగిరి పడి ఒకరు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి. తిరుపతిలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. మదనపల్లెకు చెందిన అభిరామానాయుడు.. తిరుపతిలో బీ-టెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థి సునీల్‌తో కలిసి తిమ్మినాయుడుపాలెంలో ఉంటున్నాడు. వీరిద్దరూ మంగళవారం వేకువజామున తిరిచానూరు నుంచి బైక్‌పై వస్తూ మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. రామానుజ సర్కిల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే వున్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మదనపల్లెకు చెందిన అభిరామానాయుడు (24) డివైడర్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడివెనుక కూర్చుని ఉన్న సునీల్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనకు అతివేగం.. నిర్లక్ష్యమే కారణమని ఎస్ఐ చెప్పారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేశారు.

# సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని.. ఆస్తికి ఎసరు!

● చీటింగ్ కేసు నమోదు చేశారని నిందితుడి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంగవైకల్య ధ్రువీకరణ పత్రం ఇప్పిస్తానని చెప్పి టీడీపీ కార్యకర్త తన ఆస్తిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ ఓ వృద్ధురాలు మంగళవారం కడప తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు షేక్ రహ్మత్ బీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలిలా.. కడప నగరంలోని నబీకోట మరాఠీవీధిలో షేక్ రహ్మత్ బీకి నాలుగున్నర సెంట్లు స్థలం ఉండగా మూడు సెంట్లలో ఇల్లు నిర్మించుకుని నివాసముంటోంది. చిలకలబావి మంచాలరామయ్య వీధిలో నివాసం ఉంటున్న షేక్ సుల్తాన్ ఇమ్రానుద్దీన్ ఆ ఇంటిని, ఖాళీస్థలాన్ని కాజేయాలని పథకం రచించాడు. బాధితురాలికి చెవుడు ఉండడంతో సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని గత ఏడాది జూన్ 12న రిమ్స్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి నేరుగా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకువెళ్లి ఇల్లు, ఖాళీస్థలాన్ని తన పేరుతో జీపీఏ చేయించుకున్నాడు. రెండోసారి షేక్ రహ్మత్‌బీని రిజిస్ట్రేషన్ ఆఫీసుకు తీసుకువెళ్లి తన తల్లి గులాబ్‌జాన్‌కు, రహ్మత్‌బీ ఒకటిన్నర సెంట్ల స్థలాన్ని విక్రయించినట్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఆ స్థలాన్ని కొలతలు వేస్తుండడంతో అనుమానం వచ్చిన రహ్మత్‌బీ ప్రొద్దుటూరులోని తన సోదరుడు నబీరసూల్‌కు తెలియజేసింది వారు వచ్చి పరిశీలించగా.. తాను రహ్మత్‌బీ భర్త షేక్ జమాల్‌కు అన్న కుమారుడినని నిందితుడు జీపీఏ పత్రాల్లో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 5న షేక్ ఇమ్రానుద్దీన్ పేరు మీద ఉన్న జీపీఏను రహ్మత్‌బీ రద్దు చేయించింది. కానీ ఒకటిన్నర సెంట్ల స్థలం గులాబ్ జాన్ పేరు మీద రిజిస్ట్రేషన్ పూర్తయి ఉండడంతో తనకు న్యాయం చేయాలని ఫిబ్రవరి 24న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీని ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో ఇమ్రానుద్దీన్‌ను పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. పలుమార్లు ఫోన్ చేసినా రాకపోవడంతో నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అతను వాస్మోల్ సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతనిని రిమ్స్‌కు తరలించారు.

## ఉమ్మడి ప్రవేశ పరీక్షతో ఉజ్వల భవిష్యత్తు

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిర్వహించే సెంట్రల్ యూనవర్సిటీ అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెసర్ పరీక్ష ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం కడప నగరం ఆర్ట్స్ కళాశాలలో ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి కృష్ణారెడ్డి, సైన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు బి రామచంద్ర, అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సీఈకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, ఎల్ఎస్‌పీ డ్యాం చైర్మన్ ఈగ రమణారెడ్డి కోరారు. మంగళవారం విజయవాడలోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్రావు ను వేరువేరుగా కలసి నిధుల మంజూరుకు సహకరించాలని కోరినట్లు తెలిపారు. బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలు నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీటిని విడుదలచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరినట్లు వివరించారు. ఎల్ఎస్‌పీ డ్యాం ద్వారా ప్రతి చెరువుకు నీరు అందించి, ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయికిరణ్‌రెడ్డి, కలూరు రామకృష్ణారెడ్డి, ఓ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కలసపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హెచ్చరించారు. కలసపాడులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ నివేదికను మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజావేదికలో డీఆర్పీలు చదివి వినిపించారు. 878 పనులకు గాను రూ.7.27కోట్లు ఖర్చుచేశారు. ఇందులో రూ.96వేలు అవినీతి జరగ్గా ఇప్పటికే రూ.30వేలు రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఆనంద్, ఎంపీడీఓ మహబూబ్‌బి, విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు రామలింగేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, ఎస్ఆర్పీ కన్నారెడ్డి, డీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైవీయూలో బోధనా సిబ్బంది క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ కాలేజ్ ఫౌండేషన్ డే సందర్భంగా మంగళవారం బోధన సిబ్బంది క్రికెట్ ఫైనల్ పోటీలను ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీ కనీవినీ ఎరుగని విధంగా పోటాపోటీగా సాగాయి. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కృష్ణారావు కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టు వి మొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో మాజీ రిజిస్ట్రార్ డి.విజయ రాఘవ ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టు నిలిచింది. విజేతలను ప్రధానాచార్యులు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, క్రీడా బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి అభినందించారు.

# ప్రకృతి వ్యవసాయం ఉత్తమం



రైతు గంగిరెడ్డి సాగుచేసిన అంతర పంటలు

- ఖర్చు తక్కువ..ఆదాయం ఎక్కువ
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు గంగిరెడ్డి

పెండ్లిమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మన పెద్దల కాలంలో ప్రకృతిలో లభించే వాటితో వ్యవసాయం చేసి ఆహార, వాణిజ్య ఉత్పత్తులను పండించేవారు. సహజంగా దొరికే పేడ, మూత్రం తదితర వాటితో భూసారాన్ని పెంచుతూ వ్యవసాయం చేసేవారు. ఖర్చులు తక్కువగా ఉండి.. దిగుబడులు ఎక్కువగా వచ్చి మంచి ఆదాయం లభి స్తుండేది. అయితే కాలక్రమంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకంతో రైతులకు ఖర్చులు విపరీతంగా పెరిగి పంటల దిగుబడి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకో వాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం గణనీయంగా తగ్గి పంటలు



పంటల రక్షణ కోసం వాడుతున్న కషాయాలు



ఆదర్శరైతు గంగిరెడ్డి

దిగుబడి మందగించింది. ఈ నేపథ్యంలో ఆదర్శ రైతు గంగిరెడ్డి ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి మం చి ఆదాయం పొందుతూ పలువురికి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పెండ్లిమర్రి మండలం చెన్నమరాజు పల్లె గ్రామానికి చందిన ఆదర్శ రైతు గంగిరెడ్డి ఆయన తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకుని 2008 సంవత్సరంలో పురుగు మందుల వాడకం లేని (ఎన్‌పీయం) వ్యవసాయాన్ని మొదలు పెట్టాడు. ప్రకృతిలో దొరికే వేప, కానుగ, సీతాఫలం, ఉమ్మెత్త ఆకులు, వేపగింజలు, కానుగ గింజల పౌడర్, తెల్లవాయలు, కుంకుడుకాయలు, మిరియాలు, లవంగాలను గోమూత్రంతో కలిపి సర్వరోగ నివారణ ద్రావణం తయారు చేసి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులను పండిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నాడు. గంగిరెడ్డిని ఆదర్శంగా తీసుకొని మరికొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నారు. ఇక ఈయన ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, కర్నాటక, రాష్ట్రా లతో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న రైతు లకు శిక్షణ కార్యక్రమాలు కూడా ఇస్తున్నారు. అలాగే అగ్రికల్చర్ బీఎస్సీ చదివే విద్యార్థులు చెన్నమరాజుపల్లెకు వచ్చి గంగిరెడ్డి వద్ద శిక్షణ తీసుకోవడం విశేషం.

**వెల్లటూరులో వారపు మార్కెట్...**

వెల్లటూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందకు గంగిరెడ్డి తను పండించిన పంటలను వారపు మార్కెట్‌లో విక్ర యిస్తు న్నారు. దీని ద్వారా నెలకు రూ.25000ల వరకు ఆదాయం వస్తోంది. అలాగే ఈ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే ఈ విక్రయ కేంద్రం ప్రధాన లక్ష్యమని గంగిరెడ్డి చెబుతున్నారు.

## గండికోట మునకకు రూ.500 కోట్లు ఇవ్వాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఆది



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో గండికోట ప్రాజెక్టు ముంపు పరిహారం గురించి మంగళవారం ప్రభుత్వవిప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రస్తావించారు. గండికోట మునకకు సంబంధించి రూ.500 కోట్లు బకాయిలుంటే రూ.150 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారని తెలిపారు. మిగిలిన రూ.350 కోట్లు కూడా ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రాజోలి నిర్మాణం, ఎస్ఆర్‌బీసీకి నిధులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం నీటిపారుదలకు బడ్జెట్‌లో రూ.18,000 కోట్లు మాత్రమే కేటాయించారని ఈ నిధులు సరిపోవన్నారు. కేంద్రం నీతిఆయోగ్ కింద ఐదు రాష్ట్రాలను చేర్చిందని.. అందులో మన రాష్ట్రం కూడా ఉందన్నారు. దానికి అనుగుణంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు మరో రూ.18,000 కోట్ల కేటాయించేలా కేంద్రం దృష్టికి తీసుకెళదామన్నారు.

## ఆర్టీపీపీ రైతులకు న్యాయం చేయాలి

జమ్మలమడుగు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని మంగళవారం ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబును ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి కలిశారు. విజయవాడలోని ఏపీజెన్‌కో కార్యాలయాన్ని సందర్శించి ఆర్టీపీపీ రైతుల సమస్యలను వివరించారు. ఆర్టీపీపీ కోసం రైతులు భూములను కోల్పోయిన వారికి న్యాయం జరగక ఇబ్బంది పడుతున్నారన్నారు. సర్వే చేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. కూటమి నేత దేవగుడి శివనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

కడప ఎన్జీఆర్ సర్కిల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదగడానికి యోగా ఎంత గానో ఉపయోగపడుతుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నబీకోటలోని మహిళా శక్తి కేంద్రంలో మంగళవారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మహిళలు, అంగన్వాడీ వర్కర్లు, మెప్మా పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు యోగా శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ ప్రతి మహిళా యోగా తప్పకుండా చేయాలని వివరించారు. యోగా నిపుణుడు డాక్టర్ ఆర్.రంగ నాథరెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా ఎదురవుతున్న అనేక రుగ్మతలను నివారించగలిగే శక్తి యోగాకు ఉందన్నారు. అనంతరం యోగాసనాలు చేయించారు.

## రాజా ఫౌండేషన్‌లో ఆక్రమిత స్థలంపై ఆరా



రాజా ఫౌండేషన్‌లో ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

మైలవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజా ఫౌండేషన్‌లో మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ తనిఖీ చేశారు. రాజాఫౌండేషన్‌లో ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి అందుకు దారితీసిన వాటిని త్వరగా తొలగించాలని ఆదేశించారు. మైలవరం తహసీల్దారు లక్ష్మినారాయణ, సర్వేయర్ ఆర్డీవోకు ఆక్రమిత స్థలం గురించి వివరించారు. గతంలో నోటీసులు అందజేశామని, త్వరలోనే ఖాళీ చేస్తామని రాజాఫౌండేషన్ సంబంధిత అధికారులు తెలిపారని వివరించారు. త్వరగా ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఆర్డీవో తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## సీపీఐ కాలనీవాసుల దీక్షల విరమణ



నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న తహసీల్దారు ఉదయభాస్కర్

బద్వేలురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట సమీపంలో ఉన్న సీపీఐ కాలనీవాసులు తాము నివాసం ఉంటున్న చోట ఇంటిపట్టాలు ఇవ్వాలంటూ గత 12 రోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షలను మంగళవారం తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఈ ప్రాంతంలోనే ఇంటిపట్టాలు మంజూరు చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ పేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలోనే తహసీల్దారు పట్టాలు ఇస్తామని హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. అలాగే చుట్టుపక్కల ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను కూడా స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేల్, సుబ్బారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

## ఫొటో, వీడియోగ్రాఫర్ల చేయూత



ఆర్థికసాయం చేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

మైదుకూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాటి ఫొటో గ్రాఫర్ చనిపోతే మనకేమిలే అనుకోకుండా... తోటి ఫొటో, వీడియో గ్రాఫర్లు తమ వంతు విరాళమిచ్చి ఆ ఫొటో గ్రాఫర్ కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే... ఫొటో గ్రాఫర్ చంటిబాబు జనవరి 23న రాత్రి స్టూడియో పనులను ముగించుకొని మైదుకూరు నుంచి సొంతగ్రామమైన ఎర్రబల్లెకు బైక్‌పై వెళుతుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో చంటి కుటుంబానికి అండగా నిలవాలని తోటి ఫొటోగ్రాఫర్లు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మైదుకూరు, ప్రొద్దుటూరు ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ వారు మంగళవారం చంటి కుటుంబ సభ్యులకు సుమారు రూ.లక్షా 33 వేలు స్వచ్ఛందంగా సేకరించి వారికి అందించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆహ్వానం

కడప ఎన్జీఆర్ సర్కిల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కడపలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు ప్రవేశాలు ఉన్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సత్యశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ బాలురుతో పాటు ఎస్సీ, ఎస్టీల బాలురు కూడా ఈ ప్రవేశానికి అర్హులన్నారు. 6,7,8 తరగతులకు మిగిలిపోయిన సీట్లలో చేరేందుకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 1 నుంచి 31 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా.. 15 మందికి గాయాలు



కల్వటాల వద్ద బోల్తాపడిన అద్దె బస్సు

జమ్మలమడుగు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీకి చెందిన ఏపీ 39 యూవై 4299 గల ఆర్టీసీ బస్సు మంగళవారం కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామ సమీపాన బోల్తా పడినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మందికిపైగా గాయాలయ్యాయి. వీరిని అవుకు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉన్న సుబ్బమ్మ, దస్తగిరమ్మలను కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు విచారణ చేసి రిపోర్టును ఉన్నతాధికారులకు పంపుతామని డిపో మేనేజర్ తెలిపారు. కాగా, డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు ఆరోపించారు. బస్సు డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

## కలెక్టరేట్‌లో మానసిక రోగి హల్‌చల్

- సెక్యూరిటీ సిబ్బందిపై దాడి
- కట్టేసిన సిబ్బంది



సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడిన మానసిక రోగి

కడప కలెక్టరేట్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి) కడప కలెక్టరేట్‌లో సోమవారం ఓ మానసిక రోగి హల్ చేశారు. నగరంలోని రాజారెడ్డి వీధికి చెందిన అతను పీజీఆర్ఎస్‌లో తాను నివాసం ఉండే ఇళ్ల గతంలో అమ్మకాలు జరిగాయి. ఆ ఇంటి ని ఖాళీ చేయాలని కొనుగోలు దారుడు అడగడంతో తన సమస్య పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అనంతరం తన సమస్యకు ఇప్పటికిప్పుడే పరిష్కారం చూపాలని పట్టుపట్టడంతో సెక్యూరిటీ గార్డులు, సిబ్బంధి, పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతనిపై చర్యలు తీసుకోకపోగా కలెక్టరేట్ బయట వదిలి వెళ్లారు. అయితే తన సమస్య తీర్చ లేదంటూ మంగళవారం కూడా కలెక్టరేట్‌కు వచ్చి హల్‌చల్ చేశారు. అతని చర్యలను సెక్యూ రిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నోటితో కొరకడంతో వెంటనే రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కూడా తీసుకున్నట్లు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. మానసిక రోగి ఎంతకు మాట వినకపోగా, ఇతరులపై దాడులకు దిగడం, తనకు తానే రాళ్లతో గాయపరుచు కోవడంతో సిబ్బంది అతన్ని సాహసించి పట్టుకొని కట్టి వేసి పోలీసులకు సమాచారం అందించారు.

## ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య



స్వాతి మృతదేహం

చక్రాయపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని హరిజనవాడకు చెంది న పెద్దపాగా స్వాతి (24) అనే మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేర కు... స్వాతి కూలి పనులు చేసుకుంటూ జీవనం గడు పుతూ వచ్చేది. ఆమెకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ మధ్య తన భర్త సం పాదన కోసం కువైట్‌కు వెళ్లాలని నిర్ణయించు కోవడంతో ఆమె వద్దు అని వారించినట్లు తెలిసింది. ఈవిషయమై మనస్థాపం చెందిన ఆమె సోమవారం రాత్రి 11గంటల ప్రాంతంలో ఉరివేసుకొని మృతి చెంది ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. తల్లి మృతితో నలుగురు చిన్నారులు అనాథలుగా మారారు.

## ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవరుపై దాడి

కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అలంఖాన్‌పల్లె వద్ద ఆర్టీసీ అద్దె బస్సు నిలపలేదంటూ ఆగ్రహించిన ఓ వ్యక్తి ఆ డ్రైవరుపై చెప్పుతో దాడి చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడప నుంచి మైదుకూరు వైపు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సును అలంఖాన్‌పల్లె చెందిన క్రిష్టారెడ్డి ఆపేందుకు ప్రయత్నించారు. బస్సు ఆపకపోవడంతో ఆగ్రహించిన క్రిష్టారెడ్డి బస్సు వెంట పడి బస్సు డ్రైవరు బాలయ్యను చెప్పుతో కొట్టినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి అసభ్య సందేశం.. కేసు నమోదు

వేంపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న ఓ విద్యార్థిని ఫోన్‌కు తిరుపతికి చెందిన అభిషేక్ అనే వ్యక్తి అసభ్యకర సందేశం పంపడంతో కేసు నమోదు చేసినట్లు ఆర్కేవ్యాలీ ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. అసభ్య సందేశాన్ని ఆ విద్యార్థిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త దృష్టికి తీసుకురావడంతో పరిశీలించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**అధ్యాపకుడిపై వేటు:** ట్రిపుల్‌ఐటీలోనే చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థిని పట్ల ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న ఫిజిక్స్ అధ్యాపకుడు అసభ్యంగా మాట్లాడిన విషయాన్ని ఆ విద్యార్థిని డైరెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీనిపై అకడమిక్ డీన్ రత్నకుమారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ నిర్ణయం మేరకు ఆ అధ్యాపకుడిపై వేటు వేయాలని నిర్ణయించి.. వెంటనే రాజీనామా చేసి వెళ్లిపోవాలని డైరెక్టర్ ఆదేశించినట్లు ట్రిపుల్‌ఐటీ వర్గాలు తెలిపాయి.

## డాక్టర్ లాజర్‌కు ప్రపంచ న్యూరోసైన్స్ సైకియాట్రి కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం



డాక్టర్ లాజర్

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): థాయ్‌ల్యాండ్, బ్యాంకాక్‌లో ఎపిసిరస్ సైంటిఫికా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీలో జరగనున్న వరల్డ్ న్యూరోసైన్స్ అండ్ సైకియాట్రి కాన్ఫరెన్స్-2025నకు యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ వేపరాల లాజర్‌కు సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ నుంచి ఆహ్వానం అందింది. రెండు రోజుల సదస్సులో డాక్టర్ లాజర్ డెమోగ్రాఫిక్ వేరియ బుల్స్‌కు సంబంధించి కొవిడ్-19కు గురై కోలుకున్న వ్యక్తుల క్షేమ, మానసిక ఆందోళన అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పిస్తారు. రష్యా, ఇండోనేషియా, ఈజిప్ట్, కెనెడా పలు ప్రపంచదేశాల నుంచి హాజరయ్యే పరిశోధకులతో డాక్టర్ లాజర్ తన పరిశోధన జ్ఞానాన్ని పంచుకుంటారు. ఈ సందర్భంగా డాక్టర్ లాజర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి అచార్య ఫణతి ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘు నాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, అధ్యాపకులు, స్కాలర్లు అభినందించారు.

# నిండా నీళ్లున్నా పొలాలన్నీ బీళ్లే

- ముళ్లకంపలుగా పంట పొలాలు
- కన్యకచెరువు కింద పొలాల పరిస్థితి ఇదీ...
- రైతులు వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

నందలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కన్యకచెరువు నిండా నీళ్లున్నా నిరుపయోగంగా ఉంది. చెరువు కింద పొలాల్లో ముళ్లకంపలు ఏపుగా పెరిగి బీళ్లుగా మారాయి. ఈ చెరువు నీటిద్వారా గ్రామ పంచాయతీ పరిధిలోని ఈదరపల్లె, దుర్గాపురం ఎస్టీ కాలనీ, నందలూరు దళితవాడ పొలాలకు నీరందుతుంది. దుర్గాపురం ఎస్టీ కాలనీ, ఈదరపల్లె, నందలూరు దళితవాడ, నందలూరులోని ప్రాంతాల్లోని రైతులు వ్యవసాయం వైపు మక్కువ చూపిస్తున్నారు. నష్టాలు వస్తున్నాయని రైతులు వ్యవసాయం వైపు ఆసక్తి చూపడంలేదు.బతుకుదెరువు కోసం గల్ఫ్‌దేశాలకు వెళుతున్నారు. గతంలో కురిసిన వర్షాలకు చెయ్యేరులో నీరు ప్రవహించడంతో ఆ నీటిని దాదాపు 30 రోజులకు పైగా కాలువకు మళ్లిం చి చెరువులకు నింపారు. ఆ నీటిని వాడుకోకపోతే ఇంకిపోయి వృథాగా మారే అవకాశం ఉంది. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నాయి. ఈ పథకాలను వినియోగించుకుని రైతులు వ్యవసాయంపై మక్కువ చూపాల్సించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలోని రైతులు ఎక్కువ శాతం వరి, రాగి, సజ్జలు, నువ్వులు పండించేందుకు ఆసక్తి చూపుతారు. ఇవి కాకుండా మరో ఎన్నో రకాల పంటలున్నాయి. వాటిని పండించేందుకు ప్రయత్నించాలని పలువురు సూచిస్తున్నారు.


నిండుకుండలా నందలూరు మండల పరిధిలోని కన్యక చెరువు


ముళ్లపొదలతో నిండిన చెరువుకింద భూములు

### రైతులకు నచ్చ చెబుతున్నాం



కన్యక చెరువు కింద రైతులతో మాట్లాడుతున్నాం. అందులో కొంతమంది రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు వస్తున్నారు. వారికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు కూడా వివరించాం. వారు వేసే పంటలకు మండల వ్యవసాయశాఖ ద్వారా పూర్తి సహకారం అందిస్తాం.

- మల్లికార్జున, వ్యవసాయాధికారి, నందలూరు

### పంటలు సాగు చేయండి



కన్యక చెరువు కింద భూములు గల రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని కోరడం జరిగింది. చెరువు నింపేందుకు కాలువకు మరమ్మతులు జరిపి దాదాపు నెలరోజులు కష్టపడి నీటిని నింపడం జరిగింది. ఆ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

వెంకటసుబ్బయ్య, నీటి సంఘం అధ్యక్షుడు, నందలూరు

## ఆశాలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న గంగాధర్

రైల్వేకోడూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలతో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న టీబీ, లెప్రసి, కరోనా ఇతర అలవెన్సులు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలని డిమాండ్ చేశారు. జీతం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలుగా పదోన్నతి కల్పించాలని, ఏదైనా కారణం చేత ఆశాలు చనిపోతే రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కూటమి ప్రభుత్వానికి హారతి పడుతున్న ప్రజలు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి ప్రజలు విజయ హారతి పడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదుకు ఐదు స్థానాలను టీడీపీ అభ్యర్థులు కైవసం చేసుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. మంగళవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు అంజనేయరెడ్డి, నరసింహనాయుడు, అంజద్‌ఖాన్, శేఖర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఎస్‌యండీ రఫీ, రౌఫ్, హౌదర్, అమీర్ పాల్గొన్నారు.

## ఎస్‌ఐ ఎప్పుడొస్తారో...!


ఖాళీగా దర్శనమిస్తున్న ఎస్‌ఐ కుర్చీ

సిద్దవటం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం పోలీసుస్టేషన్‌కు ఎస్‌ఐ ఎప్పుడొస్తారోనని మండల ప్రజలు చర్చించు కుంటున్నారు. గత యేడాది డిసెంబరు 3న ఎస్‌ఐ చిరంజీవి బదిలీ అయ్యారు. అంతే నాటి నుంచి ఒంటిమిట్ట ఎస్‌ఐ శివప్రకాష్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా కొనసాగుతున్నారు. మూడు నెలలుగా సిద్దవటం పోలీసుస్టేషన్ ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతోంది. ఎస్‌ఐ లేక అసాంఘిక కార్యక్రమాలు, చోరీలు ఎక్కువయ్యాయి. ఈ విషయమై ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబుతో ప్రస్తావించగా తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అండర్ 16 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు పట్టణంలోని కాకతీయ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమార్ రాజు, శ్రీను తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 2, 3వ తేదిలో కడపలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో విద్యార్థులు ఎం.దేవనాథ్, వై.మనోజ్ కుమార్, కె.హర్షిత, సి.ప్రత్యూష ప్రతిభ కనబరచి ఈ నెల 14, 15, 16వ తేదీలతో పులివెందులలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన్నట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## మహిళలను గౌరవిద్దాం

సిద్దవటం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలను గౌరవిద్దాం అని మండల అభివృద్ధి అధికారిణి పణిరాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం సిద్దవటం గ్రామ సచివాలయ పరిధిలో సిద్దవటం-1 అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్‌లు మౌలాలి, పద్మావతి, ఆరోగ్య కార్యకర్త శారదా, అంగన్వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'కనీస సౌకర్యాలకు నోచుకోని రాయచోటి మున్సిపాలిటీ'


12వ వార్డులో ప్రజల సమస్యలపై ఆరాతీస్తున్న సీపీఐ నేతలు

రాయచోటిటౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన ఏపీ మహిళా స మాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్రతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ తనిఖీ

సంబేపల్లె, మార్చి4(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం మొటుకువాండ్లపల్లె దళితవాడకు చెందిన వీరాంజనమ్మ పేపర్ ప్లేట్ తయారీ యూనిట్‌ను మంగళవారం ఎస్సీ కార్పొరేషన్ డీపీఎం వివేకానందస్వామి తనిఖీ చేశారు.వెలుగు అధికారులు బ్యాంకు లింకేజీ పీఎంఏఎస్‌పై నిధులను అందించినట్లు వెలుగు సీసీ పీరయ్య తెలిపారు. బ్యాంకు రుణాన్ని సకాలంలో చెల్లంచాలన్నారు. ముడిసరుకు, మార్కెటింగ్ సౌకర్యంపై అడిగి తెలుసుకున్నారు.

## రైతు సేవా కేంద్రంలో పంట రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

రామాపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసిన వారు రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకోవాలని ఏవో నాగమణి అన్నారు. మండలంలోని బండపల్లి, కుమ్మరపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డు, ఆధార్ కార్డు లింకు అయిన ఫోన్ నెంబర్లు తప్పకుండా ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. ఏఈవో ప్రభంజని, రైతు సేవ సిబ్బంది హరీశ్ పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

సుండుపల్లె, మార్చి4(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సుండుపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి ఫరహానాఖానం తెలిపారు. మంగళవారం వైద్యశాలలో ఆశావర్కర్లతో సమావేశాన్ని నిర్వహించారు. హెల్త్ నోడల్ అధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రమణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



## 'టీడీపీ నేతలను విమర్శిస్తే తగ్గేదేలే'

రాజంపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేతలపై వైసీపీ నేతలు అవాక్కులు చవాక్కులు ఆడితే తగ్గేదే లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రౌడీ రాజకీయాలు చేస్తే చూస్తూ ఉండరన్నారు. తాను దేనికైనా సిద్ధమేనన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను విమర్శిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. టీడీపీ నేతలు, సర్పంచ్‌లు జంబు సూరి, షైనుద్దీన్, నరసయ్య, యువ నాయకులు రాముయాదవ్, మాజీ ఎంపీపీ లక్ష్మీనరసయ్య, వెంకటేశ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి రాజీనామా చేయాలి : టీడీపీ

నందలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):వైసీపీ రా జంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి రాజీనామా చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టీడీప కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నందున ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జ్యోతి శివ, నాగిరెడ్డిపల్లె, పాటూరు టీడీపీ నేత గందం గంగాధర్, ముమ్మడిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

**భూ ఆక్రమణలు జగమెరిగిన సత్యం**

వీరబల్లి : రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి భూ ఆక్రమణలు జగమెరిగిన సత్యం అని టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు ధ్వజమెత్తారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూమి 100 ఎకరాల్లో ఆకేపాటి ఎస్టేట్ నిర్మించడం వైసీపీ నాయకుల వక్రబుద్ధికి నిదర్శనమన్నారు.

## నూతన ఎమ్మెల్సీలను అభినందించిన కేకే చౌదరి


ఎమ్మెల్సీలను అభినందిస్తున్న కేకే చౌదరి

రాజంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా విజయం సాధించిన ఎమ్మెల్సీలను రాష్ట్ర గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి అభినందించారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో కృష్ణ, గుంటూరు ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్సీలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ తనపై నమ్మకంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను పరిశీలకుడిగా నియమించారని, ఘన విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు.

## కూటమికి బంపర్ మెజారిటీ ఇచ్చిన పట్టభద్రులు

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో ఆయా అభ్యర్థులు కూటమికి బంపర్ మెజారిటీ ఇచ్చారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. అత్యధిక మెజార్టీతో గెలిపించిన పట్టభద్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఉపాధ్యాయుడిపై విచారణ

రామాపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు ఎంపీపీ తెలుగు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మస్తాన్ వలీపై మంగళవారం కడప డిప్యూటీ డీఈవో రాజశేఖర్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె ఎంఈవో వెంకట్రామిరెడ్డి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మస్తాన్‌వల్లి ఖాజీపేట మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నప్పుడు గైర్హాజరుపై సస్పెండ్ చేశారని, దీనిపై విచారణ చేశామన్నారు. ఎంఈవో రామకృష్ణుడు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌పీ గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'మహిళలను గౌరవించాలి'

సిద్దవటం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళలను గౌరవించాలని ఏఎస్ఐ సుబ్బరామచంద్ర అన్నారు. మంగళవారం చాముండేశ్వరిపేట వాసవీ ఫార్మసీలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఏవైనా సమస్యలుంటే తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి పండ్లకు కవర్ల వినియోగంపై అవగాహన

లక్కిరెడ్డిపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మామిడిపండ్లకు కవర్ల వినియోగంపై మంగళవారం ఉద్యానవనశాఖ అధికారి నాగమణి కోనంపేట, దప్పేపల్లె రైతు భరోసా కేంద్రాలల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడికాయలు, నిమ్మకాయలు సైజు వచ్చినపుడు కవర్లు వాడటం వల్ల నాణ్యపెరుగతుందన్నారు. ఎగుమతులు చేస్తే మంచి ధరలు అందుతాయన్నారు.

## అలరించిన విద్యార్థుల సైన్స్‌ఫెయిర్

సిద్దవటం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండల పరిధిలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ అలరించింది. ఈ కార్యక్రమాన్ని సాయి హైస్కూల్లో అపుస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వీవీ రమణారెడ్డి, ప్రైమరీ స్కూల్లో కడప శ్రీనివాస హాస్పిటల్ అధినేత భైన శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇందులో విద్యార్థులు 150 వర్కింగ్ మోడల్ ప్రాజెక్టులతో అలరించారు.కడప జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది శివశంకర్‌రెడ్డి, మాజీ ఏపీపీ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్ల నియంత్రణపై అధికారులు దృష్టి సారించాలి

రాజంపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కవర్ల నియంత్రణపై అధికారులు దృష్టి సారించాలని పీసీసీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి పూల భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నియంత్రణపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటేనే సమస్య పరిష్కారమవుతుందన్నారు.

## సారా స్వాధీనం, ఊట ధ్వంసం

సుండుపల్లె, మార్చి4(ఆంధ్రజ్యోతి):భాగంపల్లి పంచాయతీ కుప్పగుట్ట సమీపంలో 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.దాడులు నిర్వహించి 100 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాజంపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) :ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ కార్మికులు మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఇ.సికిందర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు జీవో నంబరు 21, 31 రద్దు చేయాలని, వాహన మిత్ర 15 వేలు అందించాలని కోరారు. ఏఐటీయూసీ ఏరియా నియోజకవర్గ నేత సుబ్రమణ్యం, ఆటోవర్కర్స్ యూనియన్ నాగేశ్వరరావు, సురేష్, దస్తగిరి, రమణ, మల్లి, సాయి, పవన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు:** ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆటో యూనియన్ నాయకులు రమణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాష్ట్రంలో జీఓ 21ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రై వింగ్ లైసెన్స్ ఉన్న వారందరికీ వాహనమిత్రను అమలు చేయాలన్నారు.

## వాహనమిత్ర ఇవ్వాలని నిరసన

పెనగలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) :ఆటో కార్మికులు, డ్రైవర్లకు వాహనమిత్ర ఇవ్వాలని ఆటో డ్రైవర్లు మంగళవారం నిరసన చేపట్టారు. ఏపీ ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ మండల కార్యదర్శి ఇ.సుబ్బరాయుడు అధ్యక్షతన నిరసన తెలిపారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నంబరు 21,31లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఆటో డ్రైవర్లు, కార్మికులపై భారీ జరిమానాలు విధించే 21,31 జీవోలను రద్దు చేయాలన్నారు. ఆటో ఫెడరేషన్ మండల అధ్యక్షులు వై.చలపతి, శ్రీనివాసులు, రవి, నవీన్, నాగేంద్ర, వెంకయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి'


విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

నందలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నమాచార్య అకాడమి హైస్కూల్ కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్, డైరెక్టర్ మాడపూరి హేమలత పేర్కొన్నారు. ఆర్‌కే నాలెడ్జ్‌వారు అబాకస్ వేదిక్ మ్యాథ్స్‌లో నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీల్లో అన్నమాచార్య అకాడమి విద్యా ర్థులు ఎన్.సుబ్రమణ్యం, సీవీ తేజశ్రీ, ఎం.యశ్వంత్ ప్రథమ స్థానం, జోయామెహేక్, జి.లక్షిత్ ద్వితీయ స్థానాల్లో నిలవడంతో వారిని అభినందించారు. అలాగే విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సమ్మెట ఉమామహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉపాధి కూలి రూ.300 వచ్చేలా చూడాలి

రామాపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి):ఉపాధి కూలి రూ.300 వచ్చే విధంగా పనులు కల్పించాలని అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం అధికారులకు సూచించారు. మండలంలోని రాచపల్లి, నల్లగుట్టపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పశువుల షెడ్లను, పశువుల నీటి కుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచపల్లి గ్రామంలో పశువుల షెడ్లు, ఫారంపాండ్లు, నల్లగుట్టపల్లె గ్రామంలో పశువుల నీటికుంటలను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పెంచలయ్య, ఈసీ శివయ్య, టీఏ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్జీవో సంఘం రాయచోటి తాలూకా శాఖ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రెడ్డి


వెంకటేశ్వర్‌రెడ్డి

రాయచోటి టౌన్,మార్చి4(ఆంధ్ర జ్యోతి): ఎన్జీవో సంఘం రాయచోటి తాలూకా శాఖ అధ్యక్షుడిగా దండు వెంకటేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో రాయచోటి తాలూకా యూనిట్ కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పర్యవేక్షకులుగా శ్రీనివాసులు, నిత్యపూజయ్యలు వ్యవహరించారు. రాయచోటి తాలూకా యూనిట్ కమిటీకి సంబంధించి ఒక్కొక్క పోస్టుకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో మొత్తం సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయచోటి తాలూకా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా దేవేంద్ర, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా మహదేవ, వైస్ ప్రెసిడెంట్స్‌గా ప్రమీలమ్మ, మణికంఠ, వనజ, హరిప్రసాద్, రవిశంకర్ వెంకటశివారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ప్రతిభ కుమారి, వరలక్ష్మమ్మ మహమ్మద్‌అలీ, పార్వతమ్మ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు.

## విద్యను సక్రమంగా అభ్యసించాలి

ఓబులవారిపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సక్రమంగా విద్యనభ్యసించాలని ఎంఈవో రెడ్డయ్య తెలిపారు. మంగళవారం గాదెల హరిజనవాడ స్కూలును పరీక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

## కేంద్రీయ విద్యాలయ అభివృద్ధికి కృషి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్


సమస్యలు తెలుసుకుంటున్న సాయిలోకేష్

రాజంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ పేర్కొన్నారు. పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రుల వినతి మేరకు ఆయన మంగళవారం విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది కొరత ఉన్నట్లు తల్లిదండ్రులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన ఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ కమిషనర్ నిధిపాండేను చరవాణి ద్వారా సంప్రదించి సమస్యను మొబైల్ ద్వారా తెలిపారు. త్వరలోనే ఉపాధ్యాయులను నియమించి సమస్యను పరిష్కరిస్తామని నిధిపాండే హామీ ఇచ్చినట్లు తెలిపారు. జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శిక్షణ కొరకు అనుమతి మంజూరు చేస్తే విద్యార్థినులు జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు రాజంపేట ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకువస్తారని కోరారు. వెంటనే స్పందించిన సాయిలోకేష్ ఆట స్థలం అనుమతి కొరకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు కృష్ణయాదవ్, సుబ్బరాయుడు, రమణ, ప్రసాద్‌రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

# ఉపవాసం.. ఆరోగ్యదాయకం

● శారీరక, మానసిక ఉపయోగం ● ఇహపర ప్రయోజనం



పీలేరు అక్సా మసీదులో ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు

పీలేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది ఉపవాసం (రోజా). రంజాన్ మాసానికి మాత్రమే ప్రత్యేకమైన, ప్రధానమైన ఆరాధన ఉపవాసం. ఏడాదిలోని 11 నెలలు తమకిష్టమైన రీతిలో గడిపే ముస్లింలు రంజాన్ మాసంలో మాత్రం విధిగా ఉపవాసాలు పాటిస్తారు. కలీమా, నమాజు, రోజా, జకాత్, హజ్, అనేవి ఇస్లాం ధర్మానికి మూలస్తంభాలు. వాటిలో నమాజ్ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగినది రోజా. జకాత్ (పేదలకు దానం చేయడం), హజ్ (పవిత్ర మక్కా యాత్ర) ఆర్థిక స్థోమత ఉన్న వారు మాత్రమే చేయగలిగినది. నమాజు, రోజా మాత్రం పేద, ధనిక తేడా లేకుండా అందరూ ఆచరించగలిగిన ధర్మం. ఉపవాసాలు పాటించడం వల్ల ఇహ, పర ప్రయోజనాలు న్నాయని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రంజాన్ మాసపు ఉపవాసాలు పాటించాలని పెద్దలు చెబుతున్నారు.

### ఆకలి బాధ గ్రహించేందుకు.....

పేదల ఆకలి బాధ అందరికీ తెలియాలన్న లక్ష్యంతో అల్లాహ్ రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించాలని ఆదేశించారని మహమ్మద్ ప్రవక్త (స.అ.సం) తన హదీసుల్లో తెలియజేశారు. ఆకలి బాధను గ్రహించిన వారికి తమ పొరుగు వారి బాధలను సులభంగా అర్థం చేసుకుని వారికి సహాయపడే గుణం అలవడుతుందన్నది ఉపవాస ప్రయోజనాల్లో ఒకటి. ఆరోగ్యంగా ఉంటూ రంజాన్ మాసపు పవిత్రత పొందలేని వాడు నిజంగా దురదృష్టవంతుడని ఆయన తెలిపారు. ఏడాదికి 11 నెలలు సొంతానికి, రంజాన్ నెల మాత్రం అల్లాహ్ ఇబాదత్ (దైవ చింతన) కోసం ఏర్పాటైనట్లు మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) పేర్కొన్నారు. ఉపవాసాలు ఉన్న వారికి అల్లాహ్ అనుగ్రహంతోపాటు, సాధారణ రోజుల కంటే అధిక ఆహారం లభిస్తుందని ఆయన తెలిపారు. దైవ చింతన తప్ప ప్రాపంచిక విషయాలపై దృష్టి మరల్చకుండా, చాడీలు, అబద్ధాలకు దూరంగా ఉంటూ ఐదు పూటలా నమాజు పాటిస్తూ ధర్మనిష్ఠ, నిష్కల్మష మనసుతో ఉపవాసాలు చేస్తే మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

**ఉపవాస దినాల్లో పాటించాల్సిన నియమాలు**

- ఉపవాసాలు ఉన్న వారు విధిగా ఐదు పూటలా నమాజు చేయాలి.
- రాత్రి తరావీహ్ నమాజు చేయాలి.
- చాడీలు, అబద్ధాలు చెప్పకూడదు.
- తగవులు, మనస్పర్థలకు దూరంగా ఉండాలి.
- ఉపవాసం ప్రారంభించేటప్పుడు (సెహర్), సాయంత్రం ఉపవాస దీక్ష విరమించేటప్పుడు (ఇఫ్తార్) దీక్షా సంకల్పం (నియ్యత్) పఠించాలి.
- పాపిష్టి సొమ్ము అని తెలిసిన తరువాత దానిని భుజించకూడదు.

**ఉపవాసంతో లాభాలు..**

- ఉపవాసాలతో జీర్ణాశయ వ్యవస్థ ప్రక్షాళన అవుతుంది.
- శరీరంలో గ్లూకోజ్ నిల్వలపై నియంత్రణ,ఇన్సులిన్ గ్రహించేశక్తి పెరుగుతుంది.
- రోగాల నుంచి సహజ రక్షణ లభిస్తుంది.
- చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- హైబీపీ దూరమవుతుంది.
- ఆకలిపై అదుపు పెరుగుతుంది.
- నిగ్రహ శక్తి పెరుగుతుంది. .

### మూడు భాగాలుగా ఉపవాసాలు..

రంజాన్ మాసపు 30 ఉపవాసాలు మూడు భాగాలుగా విభజితమయ్యాయి. మొదటి పది ఉపవాసాలను అల్లాహ్ కరుణను (రెహమత్) అభ్యర్థించేవిగా, రెండవ పది ఉపవాసాలను తాము చేసిన పాపాల నుంచి క్షమాపణ కోరడం, మూడవ పది ఉపవాసాలను దైవానుగ్రహం కోరేవిగా విభజించారు. ఆయా రోజుల్లో ఆయా ప్రార్థనలను ఉపవాస దీక్షల విరమణ సమయంలో విధిగా పాటించాలని మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) తెలిపారు.

### ఉపవాసాలపై పరిశోధనకు నోబెల్ ప్రైజ్

ముస్లిం ఉపవాసాలపై చేసిన పరిశోధనలకుగాను యాషినోరి ఓషుమీ అనే జపాన్ శాస్త్రవేత్తకు 2016లో నోబెల్ బహుమతి లభించింది. ఉపవాసాల వల్ల శరీరంలో ఆటోఫ్యాగీ (సెల్ఫ్ ఈటింగ్ సిస్టం) జరిగి క్యాన్సర్ కణాలు, రోగ కారక క్రిములు నశిస్తాయని ఆయన శాస్త్రీయంగా నిరూపించారు.

**ఆరోగ్యవంతులందరూ ఉపవాసాలు చేయాలి**



ఉపవాసాల ప్రయోజనాలు పొందలేని వారు దురదృష్టవంతులని మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) తెలిపా రు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రం జాన్ ఉపవాసాలు పాటించాలి. ఉపవాసా లు ఓర్పు, సహనం నేర్పిస్తాయి. రంజాన్ మాసంలో నేర్చుకున్న విషయాలతో మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా, నియమబద్ధంగా, ఉన్నతంగా గడపవచ్చు.

- ముఫ్తీ అబ్దుల్లా, ఇమామ్, జామియా మసీదు, పీలేరు

# ప్రీ స్కూల్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

● ఐసీడీఎస్ పీడీ రమాదేవి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ రమాదేవి

పీలేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పూర్వ పాఠశాల విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధి కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. ఆర్టీసీ నల్లగుట్టలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె అంగన్‌వాడీ కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆటపాటలతో చిన్నారులను ఉత్సాహపరిచారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,275 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో 1,858 ప్రధాన, 417 మినీ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1030 కేంద్రాలు సొంత భవనాల్లో నడుస్తుండగా 795 కేంద్రాలు అద్దె భవనాల్లో, 450 కేంద్రాలు ఉచిత భవనాల్లో నడుస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 9,260 మంది గర్భిణులు, 8,323 మంది బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, ఇతర సేవలు అందిస్తున్నామన్నారు. ఏడు నెలల పసికందు నుంచి మూడేళ్ల వయసున్న 53,022 మంది, 3-6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు 42,037 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పొందడమే కాకుండా పూర్వ పాఠశాల విద్యను పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజమ్మ, సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ వర్కర్లు అఖిల, అనిత, సహాయకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైభవంగా బాట గంగమ్మ రాత్రి తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో బాటగంగమ్మ

మదనపల్లె అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గవంక కాల్వలోని బాట గంగమ్మ ఆలయంలో రెండు రోజులుగా తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు ఆలయధర్మకర్త బొగ్గిటి అలివేలు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయం శుద్ధి చేసి పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలకరించారు. సాయంత్రం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో చెక్క భజనలు, కోలాటాలు ప్రదర్శించారు. భక్తులు దీలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ బొగ్గిటి అలివేలమ్మ, తదితరులు పర్యవేక్షించారు.

# పోలీసుల అదుపులో గంజాయి ముఠా?

గుర్రంకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణం నడిబొడ్డున వెల్డింగ్ దుకాణంలో గంజాయి పట్టుబడడం గుర్రంకొండలో కలకలం రేపుతోంది. పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో దానికి అలవాటుపడిన యువకులు ఊరు దాటేసినట్లు సమాచారం. గుర్రంకొండ పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ప్రహరీగోడ పక్కనే కొందరు రేకులషెడ్‌లు ఏర్పాటు చేసుకుని అందులో వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఓ షెడ్లలో ఉన్న ఓ వెల్డింగ్ దుకాణంలో కొంత కాలంగా గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోమవారం రాత్రి తనిఖీ చేయగా కొంత మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. దీంతో గంజాయి బ్యాచ్‌ల్లో వణుకు మొదలై చాలా మంది పరారైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మధు రామచంద్రుడును వివరణ కోరగా గంజాయి పట్టుబడిన విషయం వాస్తవమేనని, నిందితులను పూర్తి స్థాయిలో విచారణ చేసి ముఠా సభ్యులను అరెస్టు చూపుతామన్నారు.

# పక్కా గృహాల నిర్మాణం పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ శివయ్య



విలేకరులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శివయ్య

రామాపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణాలను మార్చి 30 నాటికి పూర్తి చేయించాలని హౌసింగ్ పీడీ శివయ్య ఏఈలను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 79,721 పక్కా గృహాలు మంజూరు కాగా, 2024 జూన్ నాటికి 33,179 పక్కా గృహాలు పూర్తి కాగా, 12,390 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. జిల్లా వ్యాప్తంఠ 32,118 పక్కా గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో 4,864 పక్కా గృహాల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రామాపురం మండలంలో హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న కేఎస్‌ఎం ప్రసాద్ 12 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తుండడంతో ఆయనను ఓబులవారిపల్లె మండలానికి బదిలీ చేస్తూ ఈ నెల 1న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని, కానీ ఇంతవరకు ఆఫీసుకు రాలేదని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక వారానికి మూడుసార్లు హౌసింగ్ లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అవుతోందని దీంతో లబ్ధిదారులు ఉత్సవంలా తమ ఇళ్లను నిర్మించుకుంటున్నారన్నారు.

ఈ ప్రభుత్వం ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, బీసీ చేనేత మగ్గాలకు రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు శ్రద్ధ చూపి త్వరగా గృహాలు నిర్మించుకోవాలన్నారు. కొత్తగా ఇళ్లు కావలసిన వారు, సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవాలనుకున్న వారు గ్రామ పరిధిలోని సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ డిజిటల్ అసిస్టెంట్లను కలిసి దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సీఈకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, ఎల్‌ఎస్‌పీ డ్యాం చైర్మన్ ఈగ రమణారెడ్డి కోరారు. మంగళవారం విజయవాడలోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్రావు ను వేరువేరుగా కలసి నిధుల మంజూరుకు సహకరించాలని కోరినట్లు తెలిపారు. బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలు నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీటిని విడుదలచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరినట్లు వివరించారు. ఎల్‌ఎస్‌పీ డ్యాం ద్వారా ప్రతి చెరువుకు నీరు అందించి, ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయికిరణ్‌రెడ్డి, కలూరు రామకృష్ణారెడ్డి, ఓ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

సిద్దవటం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరంలో సోమవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. డీలర్ బిట్రా సుబ్బరాయుడు, ఎండీయూ ఆపరేటర్ శంకర్ నివాసాల్లో 750 కిలోల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, వీఆర్వో శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు ఆక్రమిస్తే కఠినచర్యలు: ఆర్డీవో

● కొండ్రాజుపల్లె చెరువులో ఆక్రమణల పరిశీలన

● హెచ్చరిక బోర్డులు ఏర్పాటు





కొండ్రాజుపల్లె చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్, హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కాశినాయన మార్చి4(ఆంధ్రజ్యోతి)చెరువులు ఆక్రమిస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టేదిలేదని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ హెచ్చరించారు. మంగళవారం ఆక్రమణకు గురైన కొండ్రాజుపల్లె చెరువును తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. చెరువులో ఆక్రమణదారులు బోర్లు వేసి కరెంట్ సర్వీసులు ఏర్పాటు చేసుకొని అరటి,దొండ,బత్తాయి తదితర పంటలను సాగుచేయడం, మరి కొందరు పంటలు సాగుచేసేందుకు చెరువు దుక్కిదున్ని సిద్ధం చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువు మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1017, 1018 సర్వే నెంబర్లలోని 151.10 ఎకరాల్లో చెరువు విస్తరించిందన్నారు. ఇందులో పట్టాభూమి 35.75 ఎకరాలు, ప్రభుత్వభూమి 115.34 ఎకరాలు ఉందన్నారు. దాదాపు 67 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయి విస్తీర్ణాన్ని గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలని, చెరువులోకి ఆక్రమణదారులు ఎవరూ దిగకుండా చుట్టూ కందకం తవ్వాలని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు చెరువుకు హద్దులు నిర్ణయించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో బద్వేల్ సర్వే డీఐ రఘురామయ్య, మండల సర్వేయర్ రామాంజనేయులు, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ కొండారెడ్డి స్థానిక వీఆర్వో నరసింహులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కలసపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హెచ్చరించారు. కలసపాడులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ నివేదికను మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజావేదికలో డీఆర్పీలు చదివి వినిపించారు. 878 పనులకు గాను రూ.7.27కోట్లు ఖర్చుచేశారు. ఇందులో రూ.96వేలు అవినీతి జరగ్గా ఇప్పటికే రూ.30వేలు రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఆనంద్, ఎంపీడీఓ మహబూబ్‌బి, విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు రామలింగేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ కన్నారెడ్డి, డీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాలివీడు, మార్చి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భిక్షాటన చేసుకునే గుర్తు తెలియని వ్యక్తి కడప రిమ్స్ లో మృతి చెందాడని, అతడి గురించి తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. 30 ఏళ్లుగా గాలివీడు పట్టణంలోని గేటు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ వీధుల్లో తిరుగుతుండే అతను అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడిని గుర్తుపడితే గాలివీడు ఎస్ఐ 9121100556 సెల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**రాజంపేటలో..**



యాచకుడి మృతదేహం

రాజంపేట టౌన్: రాజంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని ఓ వృద్ధ యాచకుడు మృతి చెందాడు. రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మెయిన్‌గేటు ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి పక్కన అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అతని వివరాలు తెలియరాలేదు.

# వైసీపీ నేతల ఆక్రమణలపై విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దారు సుబ్బలక్ష్మమ్మ, ఎంపీడీవో భాస్కర్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ

అట్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన 1245/6 సర్వే నెంబరులోని సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిలో 20 ఏళ్లుగా స్థానికంగా ఉన్న యాదవులు గొర్రెలను మేపుకునే వారు. సుమారు 55 కుటుంబాలు అందులోనే గుడిసెలు వేసుకుని, దొడ్లు కట్టుకుని గొర్రెలను పోషించుకునేవారు. 2022లో వైసీపీ నాయకులు ఆ గుడిసెలు, దొడ్లను తొలగించి యంత్రాలతో చదును చేసి భూమిని ఆక్రమించుకోవడంతో కోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకు మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం సమర్పించడంతో, సమస్యను పరిశీలించాలంటూ ఆయన జిల్లా అధికారులకు రెఫర్ చేసినా, స్థానిక అధికారులెవరూ పట్టించుకోలేదని యాదవ సంఘం నాయకుడు గురవయ్య తెలిపారు. ఇంతలో సమస్య పరిష్కారమైందా అంటూ వారం రోజుల క్రితం విజయవాడ టీడీపీ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో పరిష్కారం జరగలేదని సమాధానమిచ్చామన్నారు. వారం రోజుల అనంతరం మంగళవారం అట్లూరు తహసీల్దారు సుబ్బలక్ష్మి, ఎంపీడీవో భాస్కర్ బాబు, అట్లూరు ఎస్ఐ రామకృష్ణ తమ ఇంటి దగ్గరకు వచ్చి విచారణ చేశారన్నారు. న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు గురవయ్య వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ 1245/6 సర్వే నెంబరు లో 2009లో కొందరికి పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో ఉందని తెలిపారు. . ఈ కార్యక్రమంలో వీఆర్వో సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈ చిన్నారులకు దిక్కెవరు?

● తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన బాలికలు



తల్లిదండ్రులతో చిన్నారులు కృతికారెడ్డి, లిత్వికారెడ్డి (ఫైల్)

కురబలకోట, మార్చి 4 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదం ఇద్దరు చిన్నారులను అనాథలను చేసింది. వాల్మీకిపురం మండలం విఠలం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ అడవిపల్లెకు చెందిన శారద(40) మృతి చెందగా, ఆ ప్రమాదంలో గాయపడిన మాధవ రెడ్డి(50) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం మాధవరెడ్డి అంత్యక్రియల సందర్భంగా వారి కూతుళ్లు ఏడేళ్ల కృతికారెడ్డి, మూడేళ్ల లిత్వికారెడ్డి రోదన కంట తడి పెట్టించింది. అమ్మా...నాన్నా మాకు దిక్కెవరంటూ రోదిస్తున్న ఆ చిన్నారులను సమదాయించడం ఎవరికీ సాధ్యం కాలేదు.

# ఫ్లై ఓవర్‌పై అతివేగం

● ఒకరి దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): గరుడ వారధిపై బైకును మితిమీరిన వేగంతో నడిపారు. రామానుజం సర్కిల్ వద్ద అదుపు చేయలేక రక్షణ గోడను ఢీకొన్నారు. ఇద్దరు యువకులు పైకి ఎగిరి పడి ఒకరు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి. తిరుపతిలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. మదనపల్లెకు చెందిన అభిరామానాయుడు.. తిరుపతిలో బీ-టెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థి సునీల్‌తో కలిసి తిమ్మినాయుడుపాలెంలో ఉంటున్నాడు. వీరిద్దరూ మంగళవారం వేకువజామున తిరిచానూరు నుంచి బైక్‌పై వస్తూ మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. రామానుజ సర్కిల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే వున్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మదనపల్లెకు చెందిన అభిరామానాయుడు (24) డివైడర్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడివెనుక కూర్చుని ఉన్న సునీల్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనకు అతివేగం.. నిర్లక్ష్యమే కారణమని ఎస్ఐ చెప్పారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేశారు.

# సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని.. ఆస్తికి ఎసరు!

● చీటింగ్ కేసు నమోదు చేశారని నిందితుడి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంగవైకల్య ధ్రువీకరణ పత్రం ఇప్పిస్తానని చెప్పి టీడీపీ కార్యకర్త తన ఆస్తిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ ఓ వృద్ధురాలు మంగళవారం కడప తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు షేక్ రహ్మత్ బీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలిలా.. కడప నగరంలోని నబీకోట మరాఠివీధిలో షేక్ రహ్మత్ బీకి నాలుగున్నర సెంట్లు స్థలం ఉండగా మూడు సెంట్లలో ఇల్లు నిర్మించుకుని నివాసముంటోంది. చిలకలబావి మంచాలరామయ్య వీధిలో నివాసం ఉంటున్న షేక్ సుల్తాన్ ఇమ్రానుద్దీన్ ఆ ఇంటిని, ఖాళీస్థలాన్ని కాజేయాలని పథకం రచించాడు. బాధితురాలికి చెవుడు ఉండడంతో సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని గత ఏడాది జూన్ 12న రిమ్స్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి నేరుగా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకువెళ్లి ఇల్లు, ఖాళీస్థలాన్ని తన పేరుతో జీపీఏ చేయించుకున్నాడు. రెండోసారి షేక్ రహ్మత్‌బీని రిజిస్ట్రేషన్ ఆఫీసుకు తీసుకువెళ్లి తన తల్లి గులాబ్‌జాన్‌కు, రహ్మత్‌బీ ఒకటిన్నర సెంట్ల స్థలాన్ని విక్రయించినట్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఆ స్థలాన్ని కొలతలు వేస్తుండడంతో అనుమానం వచ్చిన రహ్మత్‌బీ ప్రొద్దుటూరులోని తన సోదరుడు నబీరసూల్‌కు తెలియజేసింది వారు వచ్చి పరిశీలించగా.. తాను రహ్మత్‌బీ భర్త షేక్ జమాల్‌కు అన్న కుమారుడినని నిందితుడు జీపీఏ పత్రాల్లో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 5న షేక్ ఇమ్రానుద్దీన్ పేరు మీద ఉన్న జీపీఏను రహ్మత్‌బీ రద్దు చేయించింది. కానీ ఒకటిన్నర సెంట్ల స్థలం గులాబ్ జాన్ పేరు మీద రిజిస్ట్రేషన్ పూర్తయి ఉండడంతో తనకు న్యాయం చేయాలని ఫిబ్రవరి 24న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీని ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో ఇమ్రానుద్దీన్‌ను పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. పలుమార్లు ఫోన్ చేసినా రాకపోవడంతో నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అతను వాస్మోల్ సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతనిని రిమ్స్‌కు తరలించారు.

### ఉమ్మడి ప్రవేశ పరీక్షతో ఉజ్వల భవిష్యత్తు

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిర్వహించే సెంట్రల్ యూనవర్సిటీ అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెసర్ పరీక్ష ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం కడప నగరం ఆర్ట్స్ కళాశాలలో ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి కృష్ణారెడ్డి, సైన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు బి రామచంద్ర, అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న రెండు గ్రామాల వీఆర్వోలు

పెనగలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పెనగలూరు మండలం ఓబిలి వీ ఆర్వో నరసింహులు, నందలూరు మండలం టంగుటూరు వీఆర్వో శివకుమార్ మంగళవారం అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్ల డ్రైవర్లకు, వీఆర్వోల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వారు దాడికి తెగబడే పరిస్థితి వస్తుందని పసిగట్టిన వీఆర్వోలు పెనగలూరు పోలీసులకు, స్థానిక తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు. అయితే, వారి నుంచి ఎలాంటి సహకారం లభించకపోవడంతో స్థానికుల సాయంతో కొన్ని ట్రాక్టర్లను మాత్రం ఇసుక నింపుకోకుండా అడ్డుకోగలిగారు.

# వైవీయూలో బోధనా సిబ్బంది క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ కాలేజ్ ఫౌండేషన్ డే సందర్భంగా మంగళవారం బోధన సిబ్బంది క్రికెట్ ఫైనల్ పోటీలను ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీ కనీవినీ ఎరుగని విధంగా పోటాపోటీగా సాగాయి. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కృష్ణారావు కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టు వి మొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో మాజీ రిజిస్ట్రార్ డి.విజయ రాఘవ ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టు నిలిచింది. విజేతలను ప్రధానాచార్యులు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, క్రీడా బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి అభినందించారు.

# ప్రకృతి వ్యవసాయం ఉత్తమం



రైతు గంగిరెడ్డి సాగుచేసిన అంతర పంటలు

- ఖర్చు తక్కువ..ఆదాయం ఎక్కువ
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు గంగిరెడ్డి

పెండ్లిమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మన పెద్దల కాలంలో ప్రకృతిలో లభించే వాటితో వ్యవసాయం చేసి ఆహార, వాణిజ్య ఉత్పత్తులను పండించేవారు. సహజంగా దొరికే పేడ, మూత్రం తదితర వాటితో భూసారాన్ని పెంచుతూ వ్యవసాయం చేసేవారు. ఖర్చులు తక్కువగా ఉండి.. దిగుబడులు ఎక్కువగా వచ్చి మంచి ఆదాయం లభి స్తుండేది. అయితే కాలక్రమంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకంతో రైతులకు ఖర్చులు విపరీతంగా పెరిగి పంటల దిగుబడి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకో వాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం గణనీయంగా తగ్గి పంటలు



ఆదర్శరైతు గంగిరెడ్డి



పంటల రక్షణ కోసం వాడుతున్న కషాయాలు

దిగుబడి మందగించింది. ఈ నేపథ్యంలో ఆదర్శ రైతు గంగిరెడ్డి ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి మం చి ఆదాయం పొందుతూ పలువురికి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.


పెండ్లిమర్రి మండలం చెన్నమరాజు పల్లె గ్రామానికి చందిన ఆదర్శ రైతు గంగిరెడ్డి ఆయన తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకుని 2008 సంవత్సరంలో పురుగు మందుల వాడకం లేని (ఎన్‌పీయం) వ్యవసాయాన్ని మొదలు పెట్టాడు. ప్రకృతిలో దొరికే వేప, కానుగ, సీతాఫలం, ఉమ్మెత్త ఆకులు, వేపగింజలు, కానుగ గింజల పౌడర్, తెల్లవాయలు, కుంకుడుకాయలు, మిరియాలు, లవంగాలను గోమూత్రంతో కలిపి సర్వరోగ నివారణ ద్రావణం తయారు చేసి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులను పండిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నాడు. గంగిరెడ్డిని ఆదర్శంగా తీసుకొని మరికొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నారు. ఇక ఈయన ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, కర్నాటక, రాష్ట్రా లతో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న రైతు లకు శిక్షణ కార్యక్రమాలు కూడా ఇస్తున్నారు. అలాగే అగ్రికల్చర్ బీఎస్సీ చదివే విద్యార్థులు చెన్నమరాజుపల్లెకు వచ్చి గంగిరెడ్డి వద్ద శిక్షణ తీసుకోవడం విశేషం.

**వెల్లటూరులో వారపు మార్కెట్...**

వెల్లటూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందకు గంగిరెడ్డి తను పండించిన పంటలను వారపు మార్కెట్‌లో విక్ర యిస్తు న్నారు. దీని ద్వారా నెలకు రూ.25000ల వరకు ఆదాయం వస్తోంది. అలాగే ఈ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే ఈ విక్రయ కేంద్రం ప్రధాన లక్షమని గంగిరెడ్డి చెబుతున్నారు.

## గండికోట మునకకు రూ.500 కోట్లు ఇవ్వాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఆది



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో గండికోట ప్రాజెక్టు ముంపు పరిహారం గురించి మంగళవారం ప్రభుత్వవిప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రస్తావించారు. గండికోట మునకకు సంబంధించి రూ.500 కోట్లు బకాయిలుంటే రూ.150 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారని తెలిపారు. మిగిలిన రూ.350 కోట్లు కూడా ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రాజోలి నిర్మాణం, ఎస్ఆర్‌బీసీకి నిధులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం నీటిపారుదలకు బడ్జెట్‌లో రూ.18,000 కోట్లు మాత్రమే కేటాయించారని ఈ నిధులు సరిపోవన్నారు. కేంద్రం నీతిఆయోగ్ కింద ఐదు రాష్ట్రాలను చేర్చిందని.. అందులో మన రాష్ట్రం కూడా ఉందన్నారు. దానికి అనుగుణంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు మరో రూ.18,000 కోట్ల కేటాయించేలా కేంద్రం దృష్టికి తీసుకెళదామన్నారు.

## ఆర్టీపీపీ రైతులకు న్యాయం చేయాలి

జమ్మలమడుగు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని మంగళవారం ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబును ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి కలిశారు. విజయవాడలోని ఏపీజెన్‌కో కార్యాలయాన్ని సందర్శించి ఆర్టీపీపీ రైతుల సమస్యలను వివరించారు. ఆర్టీపీపీ కోసం రైతులు భూములను కోల్పోయిన వారికి న్యాయం జరగక ఇబ్బంది పడుతున్నారన్నారు. సర్వే చేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. కూటమి నేత దేవగుడి శివనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదగడానికి యోగా ఎంత గానో ఉపయోగపడుతుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నభీకోటలోని మహిళా శక్తి కేంద్రంలో మంగళవారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మహిళలు, అంగన్వాడీ వర్కర్లు, మెప్మా పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు యోగా శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ ప్రతి మహిళా యోగా తప్పకుండా చేయాలని వివరించారు. యోగా నిపుణుడు డాక్టర్ ఆర్.రంగ నాథరెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా ఎదురవుతున్న అనేక రుగ్మతలను నివారిచగలిగే శక్తి యోగాకు ఉందన్నారు. అనంతరం యోగాసనాలు చేయించారు.

## రాజా ఫౌండేషన్‌లో ఆక్రమిత స్థలంపై ఆరా



రాజా ఫౌండేషన్‌లో ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

మైలవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజా ఫౌండేషన్‌లో మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ తనిఖీ చేశారు. రాజాఫౌండేషన్‌లో ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి అందుకు దారితీసిన వాటిని త్వరగా తొలగించాలని ఆదేశించారు. మైలవరం తహసీల్దారు లక్ష్మీనారాయణ, సర్వేయర్ ఆర్డీవోకు ఆక్రమిత స్థలం గురించి వివరించారు. గతంలో నోటీసులు అందజేశామని, త్వరలోనే ఖాళీ చేస్తామని రాజాఫౌండేషన్ సంబంధిత అధికారులు తెలిపారని వివరించారు. త్వరగా ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఆర్డీవో తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా.. 15 మందికి గాయాలు



కల్వటాల వద్ద బోల్తాపడిన అద్దె బస్సు

జమ్మలమడుగు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీకి చెందిన ఏపీ 39 యూవై 4299 గల ఆర్టీసీ బస్సు మంగళవారం కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామ సమీపాన బోల్తా పడినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మందికిపైగా గాయాలయ్యాయి. వీరిని అవుకు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉన్న సుబ్బమ్మ, దస్తగిరమ్మలను కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు విచారణ చేసి రిపోర్టును ఉన్నతాధికారులకు పంపుతామని డిపో మేనేజర్ తెలిపారు. కాగా, డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు ఆరోపించారు. బస్సు డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

## కలెక్టరేట్‌లో మానసిక రోగి హల్‌చల్

- సెక్యూరిటీ సిబ్బందిపై దాడి
- కట్టేసిన సిబ్బంది



సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడిన మానసిక రోగి

కడప కలెక్టరేట్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి) కడప కలెక్టరేట్‌లో సోమవారం ఓ మానసిక రోగి హల్ చేశారు. నగరంలోని రాజారెడ్డి వీధికి చెందిన అతను పీజీఆర్ఎస్‌లో తాను నివాసం ఉండే ఇళ్లు గతంలో అమ్మకాలు జరిగాయి. ఆ ఇంటి ని ఖాళీ చేయాలని కొనుగోలు దారుడు అడగడంతో తన సమస్య పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అనంతరం తన సమస్యకు ఇప్పటికిప్పుడే పరిష్కారం చూపాలని పట్టుపట్టడంతో సెక్యూరిటీ గార్డులు, సిబ్బంది, పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతనిపై చర్యలు తీసుకోకపోగా కలెక్టరేట్ బయట వదిలి వెళ్లారు. అయితే తన సమస్య తీర్చ లేదంటూ మంగళవారం కూడా కలెక్టరేట్‌కు వచ్చి హల్‌చల్ చేశారు. అతని చర్యలను సెక్యూ రిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నోటితో కొరకడంతో వెంటనే రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కూడా తీసుకున్నట్లు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. మానసిక రోగి ఎంతకు మాట వినకపోగా, ఇతరులపై దాడులకు దిగడం, తనకు తానే రాళ్లతో గాయపరుచు కోవడంతో సిబ్బంది అతన్ని సాహసించి పట్టుకొని కట్టి వేసి పోలీసులకు సమాచారం అందించారు.

## ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య



స్వాతి మృతదేహం

చక్రాయపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని హరిజనవాడకు చెంది న పెద్దపాగా స్వాతి (24) అనే మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేర కు... స్వాతి కూలి పనులు చేసుకుంటూ జీవనం గడు పుతూ వచ్చేది. ఆమెకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ మద్య తన భర్త సం పాదన కోసం కువైట్‌కు వెళ్లాలని నిర్ణయించు కోవడంతో ఆమె వద్దు అని వారించినట్లు తెలిసింది. ఈవిషయమై మనస్థాపం చెందిన ఆమె సోమవారం రాత్రి 11గంటల ప్రాంతంలో ఉరివేసుకొని మృతి చెంది ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. తల్లి మృతితో నలుగురు చిన్నారులు అనాథలుగా మారారు.

## ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవరుపై దాడి

కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అలంఖాన్‌పల్లె వద్ద ఆర్టీసీ అద్దె బస్సు నిలపలేదంటూ ఆగ్రహించిన ఓ వ్యక్తి ఆ డ్రైవరుపై చెప్పుతో దాడి చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడప నుంచి మైదుకూరు వైపు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సును అలంఖాన్‌పల్లె చెందిన క్రిష్టారెడ్డి ఆపేందుకు ప్రయత్నించారు. బస్సు ఆపకపోవడంతో ఆగ్రహించిన క్రిష్టారెడ్డి బస్సు వెంట పడి బస్సు డ్రైవరు బాలయ్యను చెప్పుతో కొట్టినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## సీపీఐ కాలనీవాసుల దీక్షల విరమణ



నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న తహసీల్దారు ఉదయభాస్కర్

బద్వేలురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట సమీపంలో ఉన్న సీపీఐ కాలనీవాసులు తాము నివాసం ఉంటున్న చోట ఇంటిపట్టాలు ఇవ్వాలంటూ గత 12 రోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షలను మంగళవారం తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఈ ప్రాంతంలోనే ఇంటిపట్టాలు మంజూరు చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ పేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలోనే తహసీల్దారు పట్టాలు ఇస్తామని హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. అలాగే చుట్టుపక్కల ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను కూడా స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేల్, సుబ్బారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

## ఫొటో, వీడియోగ్రాఫర్ల చేయూత



ఆర్థికసాయం చేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

మైదుకూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాటి ఫొటో గ్రాఫర్ చనిపోతే మనకేమిలే అనుకోకుండా... తోటి ఫొటో, వీడియో గ్రాఫర్లు తమ వంతు విరాళమిచ్చి ఆ ఫొటో గ్రాఫర్ కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే... ఫొటో గ్రాఫర్ చంటిబాబు జనవరి 23న రాత్రి స్టూడియో పనులను ముగించుకొని మైదుకూరు నుంచి సొంతగ్రామమైన ఎర్రబల్లెకు బైక్‌పై వెళుతుండగా లారీ ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో చంటి కుటుంబానికి అండగా నిలవాలని తోటి ఫొటోగ్రాఫర్లు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మైదుకూరు, ప్రొద్దుటూరు ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ వారు మంగళవారం చంటి కుటుంబ సభ్యులకు సుమారు రూ.లక్షా 33 వేలు స్వచ్ఛందంగా సేకరించి వారికి అందించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కడపలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు ప్రవేశాలు ఉన్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సత్యశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ బాలురుతో పాటు ఎస్సీ, ఎస్టీల బాలురు కూడా ఈ ప్రవేశానికి అర్హులన్నారు. 6,7,8 తరగతులకు మిగిలిపోయిన సీట్లలో చేరేందుకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 1 నుంచి 31 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌ల్ ద్వారా దరఖఖాస్తు చేసుకోవాలన్నారు.


### ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి

## అసభ్య సందేశం.. కేసు నమోదు

వేంపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న ఓ విద్యార్థిని ఫోన్‌కు తిరుపతికి చెందిన అభిషేక్ అనే వ్యక్తి అసభ్యకర సందేశం పంపడంతో కేసు నమోదు చేసినట్లు ఆర్కేవ్యాలీ ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. అసభ్య సందేశాన్ని ఆ విద్యార్థిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త దృష్టికి తీసుకురావడంతో పరిశీలించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**అధ్యాపకుడిపై వేటు:** ట్రిపుల్‌ఐటీలోనే చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థిని పట్ల ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న ఫిజిక్స్ అధ్యాపకుడు అసభ్యంగా మాట్లాడిన విషయాన్ని ఆ విద్యార్థిని డైరెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీనిపై అకడమిక్ డీన్ రత్నకుమారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ నిర్ణయం మేరకు ఆ అధ్యాపకుడిపై వేటు వేయాలని నిర్ణయించి.. వెంటనే రాజీనామా చేసి వెళ్లిపోవాలని డైరెక్టర్ ఆదేశించినట్లు ట్రిపుల్‌ఐటీ వర్గాలు తెలిపాయి.

## డాక్టర్ లాజర్‌కు ప్రపంచ న్యూరోసైన్స్ సైకియాట్రి కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం



డాక్టర్ లాజర్

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): థాయ్‌ల్యాండ్, బ్యాంకాక్‌లో ఎపిసిరస్ సైంటిఫికా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీలో జరగనున్న వరల్డ్ న్యూరోసైన్స్ అండ్ సైకియాట్రి కాన్ఫరెన్స్-2025నకు యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ వేపరాల లాజర్‌కు సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ నుంచి ఆహ్వానం అందింది. రెండు రోజుల సదస్సులో డాక్టర్ లాజర్ డెమోగ్రాఫిక్ వేరియ బుల్స్‌కు సంబంధించి కొవిడ్-19కు గురై కోలుకున్న వ్యక్తుల క్షేమ, మానసిక ఆందోళన అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పిస్తారు. రష్యా, ఇండోనేషియా, ఈజిప్ట్, కెనెడా పలు ప్రపంచదేశాల నుంచి హాజరయ్యే పరిశోధకులతో డాక్టర్ లాజర్ తన పరిశోధన జ్ఞానాన్ని పంచుకుంటారు. ఈ సందర్భంగా డాక్టర్ లాజర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఫణతి ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘు నాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, అధ్యాపకులు, స్కాలర్లు అభినందించారు.

# గడువు దాటినా అక్రమంగా చేపల వేట

## వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని ఫిర్యాదు


ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

పెద్దతిప్పసముద్రం మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పెద్దచెరువులో చేపల వేటకు వేలం గడువు దాటినా అక్రమంగా చేపలు పట్టుకుని డబ్బు దండుకుంటున్నారని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. చేపల వేటకు వేలం సమయం దాటి పోయింది. అయితే గత పాటదారులు చెరువు తూములను ఎత్తి ఉన్న నీటిని వదిలి చేపలు పట్టుకోవాలని యత్నిస్తున్నారన్నారు. అంతేకాకుండా అధికారులతో కుమ్మక్కై ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా పంచాయతీ కార్యదర్శి, స్థానిక సర్పంచ్‌లు కలిసి సచివాలయం వద్ద రహస్యంగా సమావేశాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు మూకుమ్మడిగా వేలం పాటలను అడ్డుకున్నారన్నారు. దీంతో చేసేదిలేక వారు రాత్రి సమయాల్లో తూముల ద్వారా ఉన్న నీటిని ఖాళీ చేసి చేపలు పట్టుకునేందుకు సన్నాహాలు చేస్తుండడంతో స్థానిక నేతలు మంగళవారం సచివాలయంలో ఫిర్యాదు చేసేందుకు రాపూరివాండ్లపల్లెకు చేరుకున్నారు. పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉండడంతో ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. చెరువులో ఉన్న నీటిని ఖాళీ చేస్తే బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిపోయే ప్రమాదముందని దీనిని దృష్టిలో ఉంచుకుని చెరువులో నీటిని వదిలేయకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ జిల్లా నేతలు మల్లెం శివయ్య, మండల ప్రధానకార్యదర్శి రాపూరి శ్రీకాంత్‌రెడ్డి, కార్యం శంకర, పూల నాగరాజు, మంజునాథ్, రెడ్డిశేఖర్, ఆంజిరాజు, అర్జునా, బార్గవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పిత్రృ స్వామ్యంపై వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీ విజేతకు బహుమతిని అందజేస్తున్న ఎస్ఐ హరిహరప్రసాద్

పెద్దతిప్పసముద్రం మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో మహిళా దినోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్ శివకుమారి, ఎస్ఐ హరిహరప్రసాద్ అధ్వర్యంలో పాఠశాలల విద్యార్థినులకు పిత్రృ స్వామ్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో పురుషుల ప్రమేయం, ఆవశ్యకత, పిత్రృ స్వామ్యంపై సవాల్ చేయడం గురించి విషయాలను విద్యార్థినులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థినులకు మహిళల విశిష్టతపై వ్యాసరచనా పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ఎస్ఐ బహుమతులను అందించారు. తదుపరి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# డంపింగ్ యార్డులో నిప్పు


చెత్తకు నిప్పు పెట్టడంతో వ్యర్థాల నుంచి వస్తున్న పొగ

తంబళ్లపల్లె, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు(చెత్త సంపద కేంద్రం)లో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. పట్టణంలో సేకరించిన తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు ట్రాక్టర్ ద్వారా చెత్త సంపద కేంద్రానికి(డంపింగ్ యార్డు) తరలిస్తుంటారు. ఈ క్రమంలో యార్డులో పేరుకున్న చెత్తకు రెండు రోజుల కిందట ఎవరో ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో చెత్త, వ్యర్థాల నుంచి వస్తున్న పొగతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వెళ్లే దారి పక్కనే యార్డు ఉండడంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# దొంగల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చిప్పిలి గ్రామంలో సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన నిర్వహించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ మాట్లాడుతూ దొంగల నుంచి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లకు, దుకాణాలకు సీసీ కెమెరాలను అమర్చుకుంటే వాటి ద్వారా చోరీలకు పాల్పడే వారిని పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. దొంగల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రతలు, సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీసులు, చిప్పిలి హరి, కృష్ణారెడ్డి, నక్కలదిన్నె మేస్త్రీ శీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# గాఢాంధకారం



- కటిక చీకట్లో ములకలచెరువు
- జాతీయ రహదారి విస్తరణ పనులతో తొలగించిన విద్యుత్ దీపాలు

**దేశంలో పొడవైన రహదారిగా గుర్తింపు పొందిన ముంబై - చెన్నై జాతీయ రహదారిపై ములకలచెరువు కటిక చీకట్లో కొట్టుమిట్టాడుతోంది. మూడేళ్లగా రాత్రిళ్లు భయం... భయం, ములకలచెరువు కనపడదు. అసలు ఇది జాతీయ రహదారేనా, ఇక్కడ అసలు ఊరు ఉందా అనే అనుమానం నెలకొంటోంది. దీనికి తోడు భయానక పరిస్థితులు ఏర్పడ్డాయి. పాదచారులకు సైతం చుక్కలు కన్పిస్తున్నాయి. రెండు కిలో మీటర్ల మేర ఎక్కడా ఒక్క వీధి దీపం వెలగదు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న వీధి దీపాలు తొలగించడంతో ఈ దుస్థితి నెలకొంది. వివరాల్లోకెళితే...**

ములకలచెరువు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి - అన్నమయ్య జిల్లా సరిహద్దులోని ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు 43 కిలో మీటర్ల జాతీయ రహదారి(ఎన్‌హెచ్ - 42) విస్తరణ పనులకు కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబరులో రూ.480.10 కోట్లు విడుదల చేసింది. 2022లో ఎన్‌హెచ్ - 42 విస్తరణ పనులు ప్రారంభించారు. పనుల్లో భాగంగా పనులకు అడ్డుగా ఉన్నాయని రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. పాత విద్యుత్ స్థంభాలు తొలగించారు. పాత విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్త స్తంభా, విద్యుత్ టవర్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో జాతీయ రహదారిలోని షాదీమహల్ నుంచి బస్టాండు సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, పెట్రోల్ బంకు, రైల్వే గేటు వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేర ఉన్న పాత స్తంభాలు, విద్యుత్ దీపాలు తొలగించారు. అప్పటి నుంచి వీటి గురించి పట్టించుకునే నాధుడే కరవయ్యారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో దగ్గరకు వచ్చే వరకు వాహనచోదకులకు పాదచారులు కన్పించకపోవడంతో ప్రమాతాలు సంభవిస్తున్నాయి. రోడ్డు దాటే సమయంలోనూ తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. అంధగారంలో కొట్టుమిట్టాడుతుండడంతో ములకలచెరువు ప్రధాన బస్టాండ్ల రూపురేఖలు మారిపోయాయి. గతేడాడి జూలైలో జాతీయ రహదారికి ఇరువైపులా వందకుపైగా కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి వాటికి వీధి దీపాలు అమర్చారు. అయినా ఏడు నెలలుగా వెలగకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్తగా ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలిగేలా చూసి జాతీయ రహదారిలో ఉన్న ములకలచెరువులో అందగారం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


అలంకార ప్రాయంగా విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు

### చీకట్లు తొలగేనా....?



ములకలచెరువులో నెలకొన్న చీకట్లు తొలగే అవకాశాలు కన్పించడంలేదు. రాత్రిళ్లు రోడ్డు సరిగా కన్పించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

శ్రీనివాసులునాయుడు, ములకలచెరువు

# నవోదయంతో సారా నిర్మూలన


ప్రమాణం చేయిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నవోదయం ద్వారా నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి సారా రహిత గ్రామాలుగా తయారు చేద్దామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కోటకొండ తండాలో ఎక్సైజ్ సీఐ మాధవి ఆధ్వర్యంలో సారా నిర్మూలన కోసం నిర్వహించిన నవోదయం గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి సారా తయారీ, విక్రయాలను నిర్మూలించేందుకు ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. సారా రహిత గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కోటకొండ తండా ప్రజల చేత ప్రమాణం చేయించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, సర్పంచ్ తులశమ్మ, తహసీల్దారు హరికుమార్, ఎంఈఓ త్యాగరాజు పాల్గొన్నారు.

# ట్యాంకు పనులు వేగవంతం చేయండి

మదనపల్లె టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీరు అందించే చిప్పిలి సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ కోరారు. సబ్‌కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రకు వినతి పత్రం ఇచ్చిన ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగు, ప్రజలకు తాగునీరు అందించేందుకు హంద్రీనీవా కాల్వ పనుల్లో వేగం పెంచాలన్నారు. కాల్వల వెడల్పు పనులకు బదులు లైనింగ్ పనులు పూర్తి చేస్తే ఈ ఏడాదే కృష్ణా జలాలు మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు, రైతులకు అందుబాటులోకి వస్తాయన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు శ్రీనివాసులు, జిలాని, నవీన్, జగదీష్, ఆది, వినయ్, ఉదయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో గంగమ్మకు విశేషాలంకరణ



మదనపల్లె అర్బన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు మంగళవారం ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు సుష్మింత్‌స్వామి అమ్మవారికి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ అధ్యక్షుడు మూర్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి మహేష్, మార్పూరి విక్కీ, శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షించారు.

# చిన్నారుల ఆరోగ్యస్థితిపై నివేదికలు పంపాలి


అంగన్‌వాడీలకు సూచనలిస్తున్న సీడీపీఓ సుజాత

మదనపల్లె టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆరోగ్యస్థితిపై ప్రతి నెలా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని సీడీపీఓ సుజాత సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో బాల్యవివాహాలు నిర్మూలన, అడ్డుకోవడం, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, కౌమార బాలికలకు ఆరోగ్యసూత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చిరుధాన్యాలు, పౌష్టికాహార పదార్థాలపై ప్రదర్శన నిర్వహించారు.

# తిరుమలకు పాదయాత్ర

గుర్రంకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె, నడిమికండ్రిగ టీడీపీ నేతలు మంగళవారం తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల్లో పీలేరు ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలిస్తే తిరుమలకు వస్తామని మొక్కుకున్నారు. ఇందులో భాగంగా సుమారు పది మంది టీడీపీ నేతలు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. నేతలు చలమారెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు, సుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

# ఉద్యోగులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

నిమ్మనపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సామాజిక బాధ్యతను కూడా కలిగి వుండాలని శిశుగృహ సంక్షేమ శాఖ మేనేజర్ సుప్రియ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కిశోరవికాసం గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించారు. కిశోర వికాసం గ్రూపు సభ్యులు సామాజిక బాధ్యత కలిగి వుండాలన్నారు. 15నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు అవగాహన సదస్సులు, నైపుణ్యాలను తెలిజేయాలన్నారు. ఆడ పిల్లలకు సఖి గ్రూపులు, మగ పిల్లలైతే యువ గ్రూపులు ఏర్పాటు చేసి ప్రతి గ్రూపులోనూ ఐదుగురు తక్కువ కాకుండా చూడాలన్నారు. బడి మానిన పిల్లలను చేర్పించాలన్నారు.

# చెత్త కార్యాలయాలు..



వాల్మీకిపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నిజంగా అవి చెత్త కార్యాలయాలే. అవినీతికి నిలయం అంటూ విమర్శలకు తావిచ్చే తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చెత్తకు సైతం నిలయాలుగా మారినట్లు తెలుస్తోంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేర వని ప్రకటనలు గుప్పించే అధికారులు మరి వారి కార్యాలయాల పరిసరాల పట్ల నిర్లక్ష్యంతో విస్మరించారు. అవినీతిని ఏరి పారేసినట్లు చెత్తను కూడా ఏరి పారేసేందుకు వీరికి ప్రత్యేక శాఖ కావా లేమోనని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్ర వాతావరణాన్ని తలపిస్తున్నాయి. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముఖ ద్వారం ఎదుటే చెత్త పేరుకు పోయింది. కార్యాలయం ఎదుట మద్యం బాటిళ్లు దర్శన మిస్తున్నా సిబ్బందికి పట్టక పోవడం గమనార్హం. ఇక తహసీల్దార్ కార్యాలయం వద్ద చెత్త రోత పుట్టిస్తోంది. విధులకు హాజరైన అధికారులు, ఉద్యోగులు భోజనం తిన్న ప్లేట్లు, తాగిన టీ కప్పులు, చెత్తా చెదారం పడేయడంతో శుభ్రత లోపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల చెంతే ఇలా ఉంటే అధికారులు ప్రజలకు ఎలా అవగాహన కల్పిస్తారన్న విమర్శలు వస్తున్నాయి.



| ఆర్.ఓ.సి. నెం. 907/2006/ఎ1 | పురపాలక సంఘం కార్యాలయము, రాజంపేట, తేది : 04.03.2025 |
|---|---|

**బహిరంగ వేలము నోటీసు**

రాజంపేట పురపాలక సంఘమునకు సంబంధించిన దిన మార్కెట్, వారపు సంత మార్కెట్, బస్టాండ్, గేట్ జంతు వధశాల సంబంధించి ఫీజులు వసూలు చేసుకొను గుత్త హక్కును తేది. 01.04.2025 నుండి 31.03.2026 వరకు రుసుములు వసూలు చేసుకొను హక్కును గుత్తకు ఇచ్చుటకు తేది. 13.03.2025 గురువారం ఉదయం 11.30 గంటలకు రాజంపేట పురపాలక సంఘం కార్యాలయమునందు, కమీషనరు వారిచే గానీ లేక వారి అనుమతి పొందిన అధికారిచేగానీ బహిరంగ వేలము నిర్వహించబడును. వేలములో పాల్గొను వారు ఈ దిగువ తెలిపిన విధంగా ధరావత్తు మరియు సాల్వేన్సీ సర్టిఫికెట్లు ఆఫీసును సమర్పించవలెను. వివరములు : 1) డిపాజిట్ చెల్లింపు మరియు సాల్వేన్సీ ధృవ పత్రము ఆస్తి తాలుకాల ధృవపత్రము మరియు ఇ.సి. నకళ్ళు అటెస్టేషన్ సమర్పించుటకు చివరి తేది : 13.03.2025 (ఉదయం 11.00 గం.లోపు) 2) సదరు వేలములో పాల్గొనువారు జిల్లా గెజిట్ నందు నిబంధనలకు / షరతులకు లోబడి మాత్రమే పాల్గొనవలెను. 3) చెల్లించవలసిన డిపాజిట్టు మరియు దాఖలు చేయవలసిన సాల్వేన్సీ సర్టిఫికెట్లు వివరములు

| వ.నెం. | గుత్త వివరములు | డిపాజిట్ క్రింద చెల్లించ వలసిన మొత్తం | సమర్పించవలసిన సాల్వేన్సీ సర్టిఫికెట్ మొత్తం |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 1. | దిన మార్కెట్ | 6,00,000/- | 4,00,000/- |
| 2. | వారపు సంత మార్కెట్ | 2,00,000/- | 2,00,000/- |
| 3. | బస్టాండ్ గేటు | 3,00,000/- | 3,00,000/- |
| 4. | కబేళా (జంతువధశాల) | 50,000/- | 50,000/- |

కమీషనరు, రాజంపేట పురపాలక సంఘం వారి పేర నోట్ వెలువడిన తేది నుండి 13.03.2025 ఉదయం 11.00 గంటలలోగా తీసుకొనిన డి.డి.లు మాత్రమే అనుమతించబడును. సాల్వేన్సీ ఎవరి పేరుమీద వున్నదో వారు వేలముపాటలో పాల్గొనుటకు అర్హులు. సదరు అర్హతను అండర్ టేకింగ్ బదలాయించుటకు అవకాశం కానీ అధికారం కానీ లేదు. అనివార్య పరిస్థితులలో వేరొకరిని పంపాలంటే ఇరువురు నోటరీ అఫిడవిట్ నకలు అటెస్టేషన్‌తో సమర్పించవలెను. దీనిని అనుమతించు విషయము కమీషనరుగారిచే తుదినిర్ణయం ఇరువురిపై ఎలాంటి కేసులుగాని ఉండరాదు. పై షెడ్యూలు ప్రకారము పైన పేర్కొన్నవన్నియు సక్రమముగా సకాలములో చెల్లించిన వారు మాత్రమే వేలము పాటలో అనుమతించబడుదురు. అదనపు సమాచారం ఆఫీసు పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు తెలుసుకొనవలెను. 2025-2026వ సంవత్సరమునకు గెజిట్ నియమ నిబంధనలతో దినమార్కెట్, వారపు సంతమార్కెట్, బస్టాండుగేటు, కబేళా (జంతువధశాల) వేలము వేయబడును.

**షాపురూముల బహిరంగ వేలము నోటీసు**

రాజంపేట పురపాలక సంఘంనకు సంబంధించిన ఈ క్రింద తెలిపిన ఖాళీగావున్న మునిసిపల్ షాపు రూములకు గుత్త షరతులకు లోబడి తేది. 13.03.2025 గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజంపేట పురపాలక సంఘం సమావేశ భవనము నందు కమీషనరు వారిచే గానీ లేక వారి అనుమతిపొందిన అధికారిచేగానీ బహిరంగ వేలము నిర్వహించబడును. వేలములో పాల్గొను వారు ఈ దిగువ తెలిపిన విధంగా ధరావత్తు మరియు సాల్వేన్సీ సర్టిఫికెట్లు ఆఫీసుకు సమర్పించవలెను. వివరములు : 1) డిపాజిట్ చెల్లింపు మరియు సాల్వేన్సీ ధృవ పత్రము ఆస్తి తాలుకాల ధృవ పత్రము మరియు ఇ.సి. నకళ్ళు అటెస్టేషన్‌తో సమర్పించుటకు చివరితేది 13.03.2025 (మధ్యాహ్నం 3.00 గం.లోపు) 2) చెల్లించవలసిన డిపాజిట్టు మరియు దాఖలు చేయవలసిన సాల్వేన్సీ సర్టిఫికెట్లు వివరములు

| వ.నెం. | లీజు వివరములు | ఖాళీగా వున్న షాపు రూముల వివరములు | డిపాజిట్ క్రింద చెల్లించవలసిన మొత్తం | సమర్పించవలసిన సాల్వేన్సీ సర్టిఫికెట్ మొత్తం |
|---|---|---|---|---|
| 1. | 2 | 3 | 4 | 5 |
| 1. | కూరగాయల మార్కెట్ నందు వున్న షాపు రూములు | 9,11 | 50,000/- | 2,00,000/- |
| 2. | ఈడిగపాళెం షాపింగ్ కాంప్లెక్స్ రూములు | 11 | | |
| 3. | పాతబస్టాండు వద్దగల షాపింగ్ కాంప్లెక్స్ రూములు | 3,4,7,14,20,30 | | |

కమీషనరు, రాజంపేట పురపాలక సంఘం వారి పేర నోటీసు వెలువడిన తేది. నుండి 13.03.2025 లోగా తీసుకొని డి.డి.లు మాత్రమే అనుమతించబడును. సాల్వేన్సీ ఎవరి పేరుమీద వున్నచో వారే పాటలో పాల్గొనుటకు పాడుటకు అర్హులు. సదరు అర్హతను అండర్ టేకింగ్ బదలాయించుటకు అవకాశం కానీ అధికారం కానీ లేదు. అనివార్య పరిస్థితులలో వేరొకరిని పంపాలంటే ఇరువురు నోటరీ అఫిడవిట్ నకలు అటెస్టేషన్‌తో సమర్పించవలెను. దీనిని అనుమతించు విషయము కమీషనరు గారిచే తుది నిర్ణయం ఇరువురిపై ఎలాంటి కేసులుగాని వుండరాదు. పై షెడ్యూల్ ప్రకారము పైన పేర్కొన్నవన్నియు సక్రమముగా సకాలములో చెల్లించిన వారు మాత్రమే వేలము పాటలో అనుమతించబడుదురు. అదనపు సమాచారం ఆఫీసు పనిచేయు వేళలో అడిగి తెలుసుకొనవచ్చును.

సం//(పి. ఈశ్వర్‌రెడ్డి) కమీషనరు (FAC) రాజంపేట పురపాలక సంఘం

# 11న గొర్రెలు, మేకల పెంపకందారుల ధర్నా

పీలేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం 11న విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్లు గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ నారాయణ బాబు తెలిపారు. పీలేరులో ధర్నా ప్రచారపత్రాలు ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సరైన వసతులు లేక గొర్రెలు, మేకల పెంపకం దారులు వలసలు వెళుతున్నారన్నారు. గ్రామాల్లోనే వారికి వైద్యం, నీరు, దాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నా పట్టించుకోకపోవడంతో ధర్నాకు పూనుకున్నామన్నారు. నాయకులు రమేశ్, కృష్ణయ్య, మునిశేఖర్, జయచంద్ర, కదిరప్ప, రెడ్డిశేఖర్, రమణయ్య, నాగరాజు, సీపీఐ నేతలు నరసింహులు, టీఎల్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను ప్రోత్సహిస్తే కఠిన శిక్షలు తప్పవు

పీలేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను ప్రోత్సహిస్తే జైలుశిక్ష, జరిమానా వంటి కఠిన శిక్షలు తప్పవని పీలేరు కార్మిక శాఖాధికారి ఆనందబాబు హెచ్చరించారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పట్టణంలో ఇతర శాఖల అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమిస్తున్నాయన్నారు. ఎంఈఓ లోకేశ్వర రెడ్డి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, బడికి వెళ్లని పిల్లల గురించి తమకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జీవీఎస్ సంస్థ కో-ఆర్డినేటర్ నందిపాటి రూపా, మహిళా పోలీసులు కుసుమ, లావణ్య పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె అర్బన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్స్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. ఆటో డ్రైవర్స్ ఇతర మోటార్ కార్మికులకు ప్రభుత్వ వాహనమిత్ర రూ. 15వేలు ఇవ్వాలన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డ్రైవర్లకు వాహన మిత్ర ఇస్తామని చెప్పి ప్రస్తుతం భారీగా జరిమానాలు విధించే జీఓలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రో ధరలు తగ్గించాలని కోరారు. ఆటోలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు. అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లె పట్టణ కార్యదర్శి తిరుమల, ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ నేతలు వెంకటేష్, మస్తాన్, గంగులప్ప, మహబూబ్ బాషా, మస్తాన్ ఖాన్, జుబేర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో నారాయణ స్వామికి గాయాలయ్యాయి. మదనపల్లె మండలం, చిప్పిలిలో ఇంటి నుంచి రోడ్డు పక్కన వెళ్లతున్న నారాయణస్వామిని బెంగళూరు నుంచి మదనపల్లెకు వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# లైన్‌మెన్‌లు సంస్థకు వెన్నెముక


కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఈఈ

మదనపల్లె టౌన్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌సంస్థకు లైన్‌మెన్‌లు వెన్నెముకలాంటి వారని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర పేర్కొన్నారు. స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్ లైన్‌మెన్‌ల దినోత్సవం సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఎమర్జెన్సీ విధులు నిర్వహిస్తూ లైన్‌మెన్‌లు ప్రజలకు సేవలందిస్తూ, సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యార్థులకు సేవలందించాలన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటూ లైన్‌మెన్‌లు విధులు నిర్వహించాలని, ఆరోగ్యసూత్రాలు పాటించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి లైన్‌మెన్‌లకు పంచిపెట్టారు. లైన్‌ఇన్‌స్పెక్టర్ నాగరాజు, బాలకృష్ణ, శేషాద్రి నాగరాజు, రామచంద్ర, లక్ష్మీనారాయణ, కిశోర్, వుజేల్ పాల్గొన్నారు.

# బోరు సమస్యపై అన్నదమ్ముళ్ల ఘర్షణ

మదనపల్లె అర్బన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముళ్లు బోరు విషయమై మంగళవారం గొడవపడ్డారు. గాజువారిపల్లె వాసులు చంద్రయ్య, తమ్ముడు చిన్నరెడ్డెప్ప నడుమ బోరు వివాదం నడుస్తోంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు బోరు వద్ద మాటా మాటా పెరిగి తమ్ముడు చిన్నరెడ్డెప్ప, అతని కుమారుడు గంగరాజు కలిసి చంద్రయ్యను కర్రలతో కొట్టి గాయపరిచారు. కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

మదనపల్లె అర్బన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వన్‌టౌన్ ఎస్ఐ శివకుమార్ అన్నారు. మహిళా దినోత్సవాల్లో భాగంగా విజయభారతీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రస్తుతం క్షేత్ర స్థాయి నుంచి అత్యున్నత పదవులు మహిళలు అధిరోహించారన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ సేతు, ఉప్పు రామచంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి పెంచాలి

మదనపల్లె టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి పెంచాలని సైక్రియాటిస్ట్ డాక్టర్ రాధిక పేర్కొన్నారు. భాష్యంహైస్కూల్లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. డిగ్రీ పట్టభద్రులకు నిర్వహించినట్లు ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి వారికి సర్టిఫికెట్లు ఇస్తే వారిని ప్రోత్సహించినట్లే అన్నారు.

# వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

పెద్దమండ్యం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) వేసవి ఎండలకు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పెద్దమండ్యం పీహెచ్‌సీ డాక్టర్లు ఇమ్మానుయేల్, హరివర్మ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సూత్రాలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రధానంగా ఉపాధి కూలీలతో ఎండలు తక్కువగా వున్న సమయంలో పనులు చేయించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం ప్రయాణాలు సాగించాలన్నారు. ప్రతి ఒక్కరూ తగినన్ని నీరు తాగాలి, ఆహార పదార్థాలు పాడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలం తరహాలోనే ఎండకాలంలో కూడా ప్రతి ఒక్కరూ గొడుగులు వాడాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు కోరారు.

# దరఖాస్తుల ఆహ్వానం

కలకడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లుకు అర్హత కలిగిన అభ్యర్థులు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఏప్రిల్ 25న పరీక్ష జరుగుతుందన్నారు.

# నిత్యావసరాల పంపిణీ

పీలేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు మంగళవారం అధికారులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈఓ గురుమోహన్ మాట్లాడుతూ పంచాయతీలోని 115 మంది కార్మికులకు అవసరమైన చేతి తొడుగులు, సబ్బులు, నూనె, బట్టలు, మహిళలకు చీరలు, బ్లౌజ్‌లు అందజేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పురం రామ్మూర్తి, కంచి సూరి, శానిటరీ అధికారి నౌషాద్ అహ్మద్, సిబ్బంది రెడ్డిప్రసాద్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.